RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 221 శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## యమునా నది ఉధృతి..

### వాగుల్లా వీధులు, మడుగుల్లా మార్కెట్లు

న్యూఢిల్లీ: భారీ వర్షాలకు రాజధాని నగరం ఢిల్లీ విలవిల్లాడుతోంది. యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో జనావాసాలు పలు చోట్ల నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వీధులు వాగులను, మార్కెట్ ప్రాంతాలు మడుగులను తలపిస్తున్నాయి. మంజూ కా తిలా నుంచి మదన్‌పూర్ ఖాదర్, బదర్‌పూర్‌లోని పలు కుటుంబాలు తాత్కాలిక శిబారాలలో తలదాచుకుంటున్నాయి. యమునా నది 207 మీటర్ల వద్ద ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఓల్డ్ రైల్వే బ్రిడ్జి మూసేశారు. నిత్యం రద్దీగా ఉండే 'మంజూ కా తిలా' మార్కెట్‌లోకి వరద నీరు చొచ్చుకురావడంతో ఒక్కసారిగా మూగవోయింది.




## వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం..

హైదరాబాద్: నగరంలో వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నగర వ్యాప్తంగా 303 కిలోమీటర్లు మేర గణేష్ శోభాయాత్రలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

నిమజ్జనానికి సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నగరంలో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. 30 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భద్రత, రవాణా కోసం 160 గణేష్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయబడ్డాయని అధికారులు వెల్లడించారు.

**గణేష్ నిమజ్జనానికి సర్వంసిద్ధం..** నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులను, 72 కృత్రిమ కొలనులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు నిమజ్జన స్థలాల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రజల రక్షణ కోసం హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 200 మంది గజ ఈతగాళ్లను చెరువులు, కొలనుల వద్ద ఉంచినట్లు వెల్లడించారు.

శానిటేషన్ కోసం 14,486 మంది సిబ్బందిని తీసుకున్నామని అన్నారు. నిమజ్జన యాత్ర మార్గాల్లో 56,187 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ నెల 6న 50 వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఖైరతాబాద్ వినాయక నిమజ్జనం 6వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలోపు పూర్తిచేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు వెల్లడించారు.

## పంట నష్టపరిహారానికి ప్రత్యేక నిధులు.. సీఎం రేవంత్‌రెడ్డి హామీ




కామారెడ్డి : వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద ఈ ఏడాది వచ్చిందని.. తమ ప్రభుత్వం బాధితులను కచ్చితంగా ఆదుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ బాధితులకు అండగా నిలిచి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చూశారని చెప్పుకొచ్చారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నాయకులని తెలిపారు. బాధితులకు అండగా ఉండి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదుకున్నారని ఉద్ఘాటించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచించారు. ఇవాళ కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. బురుగిద్ద వద్ద ఇసుక మేటలు వేసిన పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ క్రమంలో తమకు జరిగిన నష్టాన్ని రైతులు వివరించారు. అలాగే, లింగంపేట్‌లో బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**ప్రత్యేకంగా నిధులు..** 'వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు వరదలకు తట్టుకుని నిలబడి మిమ్మల్ని కాపాడింది. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేశాం. ప్రత్యక్షంగా మీ కష్టాలను, జరిగిన నష్టాలను చూడటానికే ఇక్కడకు వచ్చాం. శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. పంటపొలాల్లో ఇసుక మేటలు తొలగించడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తాం. పంట నష్టపరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు అధికారులు అంచనాలు రూపొందించాలి. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులు పూర్తిస్థాయిలో వరద నష్టాన్ని అంచనా వేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

**కార్మికులను ఆదుకుంటాం..** 'వరదలతో పేదలు, రైతులు, విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులందరికీ వెంటనే పుస్తకాలు అందజేయాలని ఆదేశించాం. వరదల్లో నష్టపోయిన బీడీ, ఇతర పరిశ్రమ కార్మికులను ఆదుకుంటాం. కొడంగల్ ఎలాగో.. నాకు కామారెడ్డి కూడా అలాగే. అధికారుల అప్రమత్తతతో ప్రాణనష్టం జరగలేదు. సహాయక చర్యల్లో నేతలు, అధికారులు పాల్గొన్నారు. పలు శాఖలను సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాం. ముంపు ప్రాంత ప్రజలను కలుసుకునేందుకే ఇక్కడకు వచ్చాం. శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




## కామన్ మ్యాన్‌కి భలే రిలీఫ్..

## లగ్జరీలకు ఓ రేంజ్‌లో షాక్..!

### హస్తిన వేదికగా రెండు రోజులు సాగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం

## జీఎస్టీపై పలు కీలక నిర్ణయాలు

గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్-GSTలో కీలక సంస్కరణలు చోటుచేసుకున్నాయి. సామాన్యుడికి ఊరట కలిగించే పన్ను విధానంలో పునర్వ్యవస్థీకరణకు GST కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. GSTలో ఇప్పటి వరకూ కనిష్ఠంగా 5 శాతం పన్ను, గరిష్ఠంగా 28శాతం పన్నుతో 4 స్లాబులు ఉండేవి. అయితే, 12, 28 శాతం స్లాబుల్ని తొలగించాలని GST కౌన్సిల్ నిర్ణయించింది. అంటే... ఇకపై కనిష్ఠంగా 5 శాతం, గరిష్ఠంగా 18 శాతం పన్ను పడుతుంది. సామాన్యులు, రైతులకు ఊరట కలిగించడమే లక్ష్యంగా GST స్లాబుల్లో మార్పులు చేశారు. సామాన్యులు వినియోగించే హెయిర్ ఆయిల్, సబ్బులు, షాంపూలు, టూత్ బ్రెష్‌లు, టూత్ పేస్టులు, టేబుల్‌వేర్, కిచెన్‌వేర్, ఇతర గృహవసర వస్తువులపై GSTని 5 శాతానికి తగ్గించారు. అల్ట్రా హైటెంపరేచర్ పాలు, పన్నీరు, అన్ని రకాల భారతీయ రొట్టెలపై పూర్తిగా పన్ను మినహాయింపు ఇస్తూ GST కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే, గతంలో 12, 18 శాతం పన్ను స్లాబులో ఉన్న నమ్కీన్, బుజియా, సాస్‌లు, పాస్తా, ఇనిస్టెంట్ నూడిల్స్ వంటి వాటిని 5 శాతం స్లాబ్‌లోకి తీసుకొచ్చింది. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు, హార్టీకల్చర్ యంత్రాలు, కల్టివేటర్లు, హార్వెస్టర్లు, త్రెషర్లు, హేమూవర్లపై GST 12 నుంచి 5 శాతానికి తగ్గనుంది. 12 రకాల సేంద్రీయ పురుగుల మందులపై పన్నును 12 నుంచి 5 శాతానికి కుదించారు. వ్యవసాయ రంగానికి చాలా కీలకమైన సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్, అమోనియాపై GST 18 నుంచి 5 శాతానికి తగ్గిస్తూ GST కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది GST కౌన్సిల్. 33 రకాల ఔషధాలపై పూర్తిగా పన్ను మినహాయిస్తూ GST కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే, క్యాన్సర్‌తో పాటు అరుదైన జబ్బుల చికిత్సలో ఉపయోగించే మూడు ఔషధాలపై కూడా GSTని పూర్తిగా మినహాయించారు. సిమెంట్‌పై GST 28 నుంచి 18 శాతానికి తగ్గింది. సొంతిల్లు కట్టుకునే మధ్యతరగతికి ఊరట కలిగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు నిర్మలా సీతారామన్. చేతి వృత్తులు, కార్మికులు తయారు చేసే మార్బుల్ బ్లాక్‌లు, మధ్యంత చర్మ వస్తువులపై పన్ను 12 నుంచి 5 శాతానికి తగ్గింది. చేనేత రంగానికి సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ సమస్యను పరిష్కరించారు. చేనేత వస్త్రాలపై GSTని 12 నుంచి 5 శాతానికి తగ్గించారు. ACలు, అన్ని రకాల TVలు, డిష్ వాషింగ్ మెషీన్లు. చిన్న కార్లు, 350 CC కంటే తక్కువ సామర్థ్యం గల మోటార్ సైకిళ్లు 18 శాతం స్లాబులోకి రానున్నాయి. పునరుత్పాధక ఇంధన రంగానికి చెందిన వస్తువులపైనా GST 12 నుంచి 5 శాతానికి తగ్గింది.

బయోగ్యాస్ ప్లాంట్‌లు, విండ్‌మిల్స్, విండ్ ఆపరేటెడ్ ఎలక్ట్రిసిటీ జనరేటర్లు, ఫొటోవాల్టెక్ సెల్స్, సోలార్ కుక్కర్లు, సోలార్ వాటర్ హీటర్లపై పన్ను తగ్గనుంది. GSTని రెండు స్లాబులకు కుదించినా.. అత్యంత విలాస వస్తువులపై ఏకంగా 40 శాతం పన్ను విధించేలా నిర్ణయం తీసుకుంది కౌన్సిల్. పాన్ మసాలా, సిగరెట్లు, గుట్కా, జర్దా, పొగాకు, బీడీలకు వర్తిస్తుందన్నారు. కూల్‌డ్రింక్స్‌కి కూడా 40 శాతం శ్లాబు కిందకు వస్తాయి. పెద్ద కార్లు, 350 CC కంటే ఎక్కువ సామర్థ్యం గల మోటార్ సైకిళ్లు, వ్యక్తిగత అవసరాల కోసం కొనుగోలు చేసే హెలికాప్టర్లు, విమానాలు, క్రీడా అవసరాలకు వినియోగించే అన్ని రకాల పడవలకు 40 శాతం శ్లాబ్ వర్తిస్తుంది. సామాన్యుడిపై భారం తగ్గించే దిశగా GST కౌన్సిల్ సమష్టి నిర్ణయం తీసుకుందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారన్నారు. సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారామె.

## కేసీఆర్ - జగన్‌లకు బిగుసున్న ఉచ్చు!

### అక్కడ కాలేశ్వరం.. ఇక్కడ మద్యం కుంభకోణం..

## వదలని కర్మఫలం!




హైదరాబాద్ / అమరావతి : రాజకీయాలు చేయవచ్చు కానీ.. ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేయాలని.. వాటిని నిర్వీర్యం చేయాలన్న ప్రయత్నం అత్యంత ప్రమాదకరం. అది వికటిస్తే ఏ స్థాయిలో ఉంటుందో ఇప్పుడు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు తెలుస్తోంది. సొంత కుమార్తె కవిత ఆరోపణలతో కెసిఆర్ పార్టీ ఇప్పుడు సతమతం అవుతోంది. ఆ పార్టీ అసలు తెలంగాణలో నిలబడుతుందా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవప్రదమైన సీట్లను సాధించింది కేసీఆర్ పార్టీ. కానీ అక్కడకు ఎనిమిది నెలల వ్యవధిలోనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కలేదు. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని ఆ పార్టీలో ప్రకంపనలు రేగుతున్నాయి. ఒకవైపు పార్టీ పతనం అవుతుండగా.. మరోవైపు ఆ కుటుంబం సైతం ప్రజల్లో చులకన అవుతోంది. అయితే ఈ విషయంలో కెసిఆర్ మాదిరిగానే జగన్ పరిస్థితి ఉంది.

**టిడిపి కనుమరుగుతో..** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కనుమరుగైతే తప్ప తన పార్టీ బతకదని కెసిఆర్ కు తెలుసు. అందుకే తనకు రాజకీయ జీవితం ఇచ్చిన తెలుగుదేశం పార్టీని సర్వనాశనం చేశారు కేసీఆర్. అలా చేసేదాకా విడిచిపెట్టలేదు కూడా. పోనీ తన మాటను గౌరవించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నైనా గౌరవంతో చూశారా అంటే అది లేదు. ఆ పార్టీని ఎంత దెబ్బతీయాలో అంతలా తీశారు. చాలా హీనంగా మాట్లాడేవారు. కాంగ్రెస్ పార్టీ నేతలతోనే కాంగ్రెస్కు వెన్నుపోటు పొడిపించిన ఘనత కూడా కెసిఆర్ కే దక్కుతుంది. అందుకే కర్మఫలం అనేది ఎవ్వరికీ విడిచిపెట్టదు. ఇప్పుడు కెసిఆర్ కు జరుగుతోంది అదే. ముందు ఆ పార్టీ బతుకుతుందా? లేదా? అన్నది చూడాలి.

**టిడిపిని వెంటాడిన జగన్..** జగన్మోహన్ రెడ్డి సైతం తెలుగుదేశం పార్టీని పూర్తిగా నాశనం చేయాలని చూశారు. ఆ పార్టీని దారుణంగా దెబ్బతీయాలని ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. చివరకు ఎన్టీఆర్ కూతురు, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ని నిండు సభలో అవమానించారు.

తన సహచరులు దారుణ వ్యాఖ్యలు చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అంతటితో ఆగకుండా తన తండ్రి సమానుడైన చంద్రబాబును జైల్లో పెట్టించారు. అప్పటి కొందరు కేంద్ర పెద్దల సాయంతో తెలుగుదేశం పార్టీ లేకుండా చేయడానికి పన్నాగం పన్నారు. అయితే ఆయన ఒకటి తలిస్తే.. ప్రజలు ఒకటి తలచినట్టు.. తెలుగుదేశం పార్టీకి విజయం అందించి. జగన్మోహన్ రెడ్డి పన్నాగాన్ని తిప్పికొట్టారు ప్రజలు. అయితే ఇప్పుడు కర్మఫలం జగన్మోహన్ రెడ్డికి సైతం విడిచిపెట్టడం లేదు. ఏ పార్టీని నాశనం చేయాలని చూశారో.. ఏ కూటమి పార్టీలను తక్కువ చేసి మాట్లాడారో.. మీరు నా వెంట్రుక కూడా పీకలేరు అన్నారో.. ఇప్పుడు అదే జరిగింది. కర్మఫలం అనేది జగన్మోహన్ రెడ్డికి వెంటాడడం ప్రారంభించింది.

**కుంభకోణాలతో..** తెలంగాణలో కేసీఆర్‌కు కాలేశ్వరం ప్రాజెక్ట్.. ఏపీలో జగన్మోహన్ రెడ్డికి మద్యం కుంభకోణం.. ఈ రెండు ఇప్పుడు వెంటాడుతున్నాయి. కాలేశ్వరం ప్రాజెక్టుతో కాసులు కొల్లగొట్టారు నాటి పాలకులు. మద్యం కుంభకోణంలో 18 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని పక్కకు తప్పించారు. అందుకే ఇప్పుడు ఏ పార్టీలు నిర్వీర్యం కావాలని కోరుకున్నారో.. ఇప్పుడు అదే పార్టీలు కర్మఫలం రూపంలో వెంటాడుతున్నాయి. కర్మ ఫలం అంటే ఇప్పుడు సరికొత్త నిర్వచనంగా కెసిఆర్, జగన్మోహన్ రెడ్డిలను చూపిస్తున్నారు.

# సంపాదకీయం

## కవితకు కారు డోర్లు తెరచే ఉన్నాయా ?

తెలంగాణా రాజకీయాల్లో కవిత వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఎందుకు అంటే ఆమె డాటర్ ఆఫ్ కేసీఆర్ కాబట్టి అంత ప్రాముఖ్యత. ఆమె ఒకసారి ఎంపీగా మరోసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆమె తెలంగాణా జాగృతి పేరుతో ఉద్యమ కాలంలో కొన్ని కార్యక్రమాలు చేసి ఉండవచ్చు కానీ ఆమె లీడర్ షిప్ క్వాలిటీస్ అయితే నిరూపించుకునేలా ఈ మొత్తం రాజకీయ ప్రయాణంలో బలమైన ముద్ర అయితే వేయలేకపోయారు అన్నది వాస్తవం. ఇక ఆమె మీద వేటు పడింది అన్న దాని మీద భూమీ ఆకాశం దద్ధరిల్లేలా చర్చలు సగుతున్నాయి అంటే ఆమె దిగ్గజ నాయకురాలా అని కాదు కేసీఆర్ కి పేగు బంధం అని అర్ధం చేసుకోవాలని అంటున్నారు.

**కోలుకోలేని దెబ్బ తీశారా :** కవితను లైట్ తీసుకోవాలని మొదట్లో బీఆర్ఎస్ అధినాయకత్వం చూసింది. కానీ ఆమె మాత్రం తన మీద యాక్షన్‌కి పెద్దలు దిగేంతవరకూ లాగారు ఆ సంగతి వారికి అర్ధమైనా ఎందుకులే వేటు అని కొంత తగ్గి వ్యవహరించారు చివరికి అదే కొంప ముంచింది అని అంటున్నారు. కవిత తాజాగా చేసిన ఆరోపణలు అయితే బీఆర్ఎస్ కూసాలే కదిలించాయి అని అంటున్నారు. ఆమె కేసీఆర్ దేవుడు అంటూనే తనకు ఆ పార్టీలో గిట్టని వారి మీద తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు అవి చివరికి మొత్తం బీఆర్ఎస్ పార్టీకే చుట్టుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అవినీతి జరిగింది అన్నది ఆమె డిక్లేర్ చేశారు అని అంటున్నారు. అది జనంలోకి చాలా వేగంగా వెళ్ళిపోయింది అని భావించిన మీదటనే ఆలస్యంగా మేలుకున్న బీఆర్ఎస్ అధినాయకత్వం ఆమె మీద వేటు వేసింది.

**ఆమెకు మాత్రమే స్పెషల్ :** అయితే కవిత విషయంలో బీఆర్ఎస్ అధినాయకత్వం ఇంకా కొంత ప్రత్యేఅతను అభిమానాన్ని చూపించిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకు అంటే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ మాత్రమే చేశారు. ఆమెను ఏకంగా బహిష్కరించలేదు. అలా బహిషించరించినట్లు అయితే ఆమె ఏ రోజునా తిరిగి పార్టీలో చేరే చాన్స్ ఉండేది కాదు అని అంటున్నారు. అందువల్ల ఆమెకు ఆ చాన్స్ ఇంకా ఇచ్చారు అని అంటున్నారు. ఎందుకంటే ఆమె కేసీఆర్ కుమార్తె కావడమే అని చెబుతున్నారు.

**తప్పు తెలుసుకుంటేనే :** ఇక కవిత ఏదో ఆవేశంలో ఆగ్రహంతోనో తనకు తెలిసిన విషయాల మీద మాట్లాడుతూ సొంత పార్టీ వారి మీద తన కుటుంబీకుల మీద తీవ్ర విమర్శలు చేశారు. అవే నిజం అని ఆమె భావించడం వల్లనే ఘాటుగా వారి మీద విరుచుకుపడ్డారు. అయితే ఆమె తప్పు తెలుసుకుని కనుక తిరిగి వెనక్కి వేస్తే కారు డోర్లు తెరచి ఉండొచ్చు అన్న సంకేతాలను అయితే ఇచ్చేలాగానే సస్పెండ్ తో సరిపెట్టారా అన్న చర్చ ఉంది.

**అగాధం పెరిగితే :** అయితే రాజకీయాల్లో విడిపోయినంత సులువుగా కలిసేది ఉండదు. మహారాష్ట్రలో చూస్తే దాదాపుగా ఇరవై ఏళ్ళ తరువాత థాక్రే బ్రదర్స్ తాజాగా కలిశారు. ఈ రెండు దశాబ్దాల పాటు ప్రత్యర్ధులు గానే మెలిగారు. ఇక ఏపీలో చూస్తే వైఎస్సార్ ఫ్యామిలీలో అన్నా చెల్లెలు కలహించుకుంటున్నారు. ఇపుడు అది కాస్తా బీఆర్ఎస్ కి పాకింది. ఆమె మనసు మార్చుకునేలోగానే ఆమె మీద బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడి గాయపరిస్తే ఆమె సమీప భవిష్యత్తులో బీఆర్ఎస్ ముఖం చూడకపోవచ్చు అని అంటున్నారు. ఏది ఏమైనా బీఆర్ఎస్ లో ఒక రాజకీయ సంక్షోభానికి మాత్రం కవిత కారణం కావడం విశేషం

## సౌర'విద్యుత్తు'దీపం.. వెలిగితే 'ఆదా'యం



చిగురుమామిడి: ఒకప్పుడు గ్రామంలో వెలుగులు నింపిన సౌర విద్యుత్తు వీధిదీపాలు ప్రస్తుతం నిర్వహణ లేమితో మూలకుపడ్డాయి. చిగురుమామిడి మండలం చినముల్కనూర్ గ్రామాన్ని భారాస అధినేత కేసీఆర్ పదేళ్ల కిందట దత్తత తీసుకున్నారు. అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 'గ్రామ జ్యోతి' అనే కార్యక్రమంతో.. ఊరుకు అవసరమైన వసతులు పేదలకు ఇళ్లు, సీసీ రహదారులు, సౌర విద్యుద్దీపాలనూ ఏర్పాటు చేయించారు.

**ఎన్టీపీసీ సంస్థ సహకారంతో...**

విద్యుత్తు కొరత, లోవోల్టేజీతో విద్యుత్తు పంపు సెట్లు సక్రమంగా నడవడంలేదని, రాత్రుళ్లు వ్యవసాయ బావుల వద్దకు వెళితే చీకటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ రైతులు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఎన్టీపీసీ సంస్థ వారితో మాట్లాడి 2018-19 సంవత్సరంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో గ్రామంలో 210 సౌర విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయించారు. ప్రతి స్తంభానికి బ్యాటరీతోపాటు బాక్స్, పైన సోలార్ ప్లేటును అమర్చారు. పగలు సూర్యరశ్మితో సోలార్ ప్లేట్లు ఛార్జ్ అయి.. రాత్రుళ్లు దీపాలు వెలిగేవి.

**బ్యాటరీల చోరీ.. రికవరీ..**

2019లో కొందరు దుండగులు 8 సౌరవిద్యుద్దీపాల బ్యాటరీలను అపహరించారు. గ్రామస్థులు వారిని పట్టుకొని బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. తిరిగి అమర్చడంతో కొన్ని రోజుల వరకు సక్రమంగా నడిచాయి. అయితే ఏడాది తిరగకముందే మళ్లీ పెద్ద ఎత్తును బ్యాటరీలను దుండగులు దొంగిలించారు. గ్రామ పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వాటిని రికవరీ చేసి అప్పగించారు. ఛార్జింగ్, నిర్వహణ లేకపోవడంతో సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు తుప్పుపట్టి మూలకు చేరాయి.

**నెలకు రూ.50 వేల కరెంటు బిల్లు**

గ్రామంలో ప్రస్తుతం విద్యుత్తు వీధి దీపాలను వినియోగించడంతో గ్రామ పంచాయతీకి ప్రతి నెల రూ.50 వేల బిల్లు వస్తోంది. సౌర విద్యుద్దీపాలను తిరిగి మరమ్మతు చేసి వినియోగిస్తే ఈ బిల్లు భారం తప్పుతుంది. ఆ ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయొచ్చు.

**గ్రామసభలో నిర్ణయం తీసుకుంటాం**

గ్రామంలో సోలార్ వీధి దీపాలను మరమ్మతు చేయడం నిధులతో కూడుకున్న పని. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత సర్పంచి, వార్డు సభ్యులతో గ్రామ సభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం.
స్వప్న కార్యదర్శి

## అటు సంస్కరణలు.. ఇటు వసూళ్లు




జగిత్యాల : 'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి' అంటూ రెండేళ్ల కిందట విద్యుత్తు కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబరును ప్రదర్శించారు. ఆ నంబరుకు జిల్లాలో చాలా ఫిర్యాదులు వచ్చాయి. కొద్ది రోజులు అధికారులు బాగానే పని చేయగా కొంతకాలంగా పరిస్థితి మొదటికొచ్చింది. కొందరు చేతులు తడపనిదే పని చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అంచనాలు మారినా..**

మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఎనుగందుల గంగాధర్ ఇంటి నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలంలో ఉన్న విద్యుత్తు స్తంభం తొలగింపు కోసం 8 నెలల కిందట దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు రూ.72 వేల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో వినియోగదారు సహ చట్టం కింద దరఖాస్తు చేశారు. ఆ తర్వాత విద్యుత్తు అధికారులు మరోసారి అంచనా వేసి వ్యయం రూ.30 వేలుగా చూపించినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. ఎస్ఈకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.మల్యాలకు చెందిన ప్రైవేటు పాఠశాల యజమాని నూకపల్లి శివారులోని తన భూమిలో విద్యుత్తు లైన్ ఏర్పాటుకు ఆ శాఖ ఉద్యోగితో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.60 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో రూ.30 వేలు ఇచ్చారు. ఆరు నెలలైనా పనులు చేయకుండా, డబ్బులు తిరిగివ్వకుండా తాత్సారం చేస్తుండటంపై 'అమ్యామ్యాల పర్వం.. చాటుమాటు ఒప్పందం' ప్రచురితమైంది. దీంతో ఉద్యోగి డబ్బులు వాపసు ఇచ్చి తాజాగా లైన్ నిర్మాణానికి రూ.1.02 లక్షలు ఖర్చవుతుందంటూ కొత్తగా అంచనా వేసి అందించారు.

**బదిలీ అయినా అదే తీరు**

మెట్‌పల్లి డివిజన్‌లో పని చేసే ఓ విద్యుత్తు ఉద్యోగి గతంలో పని చేసిన చోట ఓ వినియోగదారుకు మంజూరైన విద్యుత్తు మీటరు బిగించేందుకు డబ్బులు డిమాండ్ చేశాడు. ఇవ్వకపోవడంతో మంజూరైన మీటరును రద్దు చేశాడు. బాధితుడు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో ఉద్యోగిని మరో మండలానికి బదిలీ చేశారు. అక్కడ కూడా వినియోగదారులను డబ్బుల కోసం వేధిస్తున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. అతడిపై విచారణ కొనసాగుతోంది.
మెట్‌పల్లి సర్కిల్‌లోని ఓ మండలంలో పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో మీటరుకు రూ.500 వరకు వినియోగదారు నుంచి వసూలు చేస్తున్నారు. కొందరు డబ్బులు ఇవ్వకపోవడంతో మీటర్లు బిగించలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై ఏఈ దృష్టికి తీసుకెళ్లి రెండు, మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు.

**మారకపోతే వేటు తప్పదు**

ఈ విషయమై ఎస్ఈ సుదర్శన్‌ను వివరణ కోరగా ఉద్యోగుల తీరు మారకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.విద్యుత్తు వినియోగదారుల ఫోరం ఛైర్మన్ నంబరు: 83339 23841

## నిర్లక్ష్యం.. వైద్యుల ఇష్టారాజ్యం



గోదావరిఖని : పట్టణంలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా.. ఆసుపత్రి వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. ఆసుపత్రి నిర్వహణలోని లోటు పాట్లను జిల్లా పాలనాధికారికి ఎవరు సమాచారం చేరవేస్తున్నారంటూ ఆరా తీస్తున్న ఆసుపత్రి వర్గాలు.. ఒక్కొక్కరిగా ఒప్పంద సిబ్బందిని తొలగిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో తొలగించిన ఒప్పంద కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా విధుల్లోకి తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. వివిధ కారణాలతో ఇతర ఒప్పంద కార్మికులను తొలగిస్తుండగా.. ఇటీవల మరొకరిని విధులకు దూరంగా ఉంచారు.

**ప్రత్యేక చొరవ తీసుకుంటూ..**

ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఫలానా సమస్య ఉందనగానే వెంటనే జిల్లా పాలనాధికారి స్పందిస్తున్నారు. దీనిలో భాగంగా అవుట్ పేషెంటు నమోదు కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మాణం, రోగుల అటెండెంట్ల కోసం ఆసుపత్రి భవనం మధ్యలో షెడ్లు వేసి బల్లలు ఏర్పాటు చేయించారు. మందులు సరఫరా చేసే గుత్తేదారుకు పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు ఇతర అవసరాలకు నిధులు కేటాయించారు. రెండు నెలలుగా మరమ్మతులకు నోచుకోని లిఫ్టు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

**కలెక్టర్ ఆదేశాలపై..**


సిబ్బంది తప్పనిసరిగా ప్రతి రోజు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలనే కలెక్టర్ ఆదేశాలను అధికారులు, సిబ్బంది ఇబ్బందిగా భావిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణను మెరుగుపరచాలనే లక్ష్యంతో తరుచూ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న జిల్లా పాలనాధికారి అక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరు ఒప్పంద ఉద్యోగులను ఇటీవల విధుల్లోంచి తొలగించారు. దీంతో రోగులు, బాలింతల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల చర్యలకు అడ్డుకట్ట వేసినట్లయింది.

## ఉపాధి తోడుగా.. కష్టాలు తీరగా

సారంగాపూర్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెలపాకలు, వర్మీ కంపోస్టు, నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పొలం బాటలు తదితర అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో పశువుల పాకలు 769, కోళ్ల షెడ్లు 386 ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించారు. వర్మీ కంపోస్టు నిర్మాణాలు 193, అజోలా ఎరువు తయారీ గుంతలు 193, ఫారంపాండ్‌లు 386 లక్ష్యాన్ని నిర్దేశించగా పనులు కొనసాగుతున్నాయి.పాకల నిర్మాణాలపై అవగాహన
జిల్లాలో వివిధ రకాల పశువులు, గొర్రెలు, కోళ్ల పాకల నిర్మాణాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల పాకకు రూ.85,000 చెల్లిస్తుండగా 18ఐ16 ఫీట్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. గొర్రెల పాకకు రూ.లక్ష చెల్లిస్తుండగా 21ఐ16తో, కోళ్ల షెడ్డుకు రూ.3 లక్షలుకాగా 50ఐ16 పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పశువుల పాకలు 769 లక్ష్యంకాగా 726 మంజూరు చేయగా 43 నిర్మాణాలు సాగుతున్నాయి. కోళ్ల షెడ్ల నిర్మాణాల కోసం 386 లక్ష్యాన్ని నిర్దేశించగా 363 మంజూరు చేయగా 19 నిర్మాణాలు, గొర్రెల షెడ్లు 91 మంజూరుకాగా 68 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 193 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గుంతలు నిర్మించాలని భావించగా 167 నిర్మాణాలు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,500, అజోలా తయారు చేసే గుంత నిర్మాణానికి రూ.6 వేలు చెల్లించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆయా నిర్మాణాలు చేపట్టేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపుపై దృష్టి**

భూగర్భ జలాల పెంపునకు ఉపాధిహామీ పనుల ద్వారా పలు



నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.4.50 లక్షలతో పర్క్‌లేషన్ ట్యాంకు నిర్మాణాలను పూర్తిగా కూలీల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 96 నిర్మాణాలు లక్ష్యంకాగా 88 నిర్మాణాలు మంజూరు చేయగా పనులు కొనసాగిస్తున్నారు. 1,922 ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంకాగా 410 ప్రగతిలో ఉన్నాయి. రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపడుతుండగా ప్రతీ మండలానికి 10 కిలోమీటర్ల చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం 764 కి.మీ. మేర రహదారులు పూర్తి చేశారు.

**కూలీలకు ఉపాధి..**

ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు కొనసాగిస్తుండగా దీని ద్వారా కూలీలకు ఉపాధి లభిస్తుంది. రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు.శివప్రసాద్, సాంకేతిక సహాయకుడు

## ఆహారశుద్ధి.. అతివల ఆర్థిక వృద్ధి

సంగారెడ్డి టౌన్: పొదుపులు.. బ్యాంకు రుణాలు.. వాయిదాల చెల్లింపులు.. మహిళా సంఘాలు అంటే గుర్తుకు వచ్చేవి ఇవే. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నా ఆశించిన స్థాయిలో స్థితిగతుల మారడం లేదు. బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండటంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. ఇందుకోసం రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

**లక్ష్యం 100 యూనిట్లు**

జిల్లాలో మిరప, పసుపు, పప్పు మిల్లులు, పాలపదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్‌మిల్లులు, పాపడాలు, పచ్చళ్ల తదితర యూనిట్లతో మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్ములేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 100 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన యూనిట్లకు 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తుల కోసం..**

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధిత రంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యూనిట్ల విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థికపరంగా సాయం అందించనున్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జంగారెడ్డి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి
ఆహారశుద్ధి యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. యూనిట్ల విస్తరణతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుంటుంది. వినియోగదారులకు కల్తీలేని ఆహార ఉత్పత్తులు అందించినట్లు అవుతుంది. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.
జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
మహిళా సంఘాలు: 18,213
ఆయా సంఘాల్లో సభ్యులు: 1.90లక్షల మంది

# అర్ధరాత్రి.. ఆకాశానికి చిల్లు!

కొత్తగూడెం: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు పలుచోట్ల ఆకాశానికి చిల్లుపడిందా అన్నరీతిలో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. అనేక చోట్ల లోలెవల్ వంతెనలు, రహదారుల పైనుంచి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీల్లోకి వాననీరు చేరికతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో నాలుగు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ములకలపల్లి మండలం పూసుగుడెం పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాదారం వద్ద పాములేరు వాగు ఉద్ధృతితో పాల్వంచ-దమ్మపేట రోడ్డు కోతకు గురైంది. ఇల్లెందు పట్టణంలోని చర్చి ఏరియాకు వెళ్లే రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో సుమారు 30కుటుంబాలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

చుంచుపల్లి మండలంలోని ఎన్‌కే నగర్ పంచాయతీ పరిధిలోని ఇళ్ల చుట్టూ వాననీరు చేరింది. విద్యానగర్ వద్ద కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన



రహదారిని వరద చుట్టుముట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దమ్మపేటలో భారీ వర్షం నమోదు కావడంతో వరద నీరు రోడ్లపైకి చేరింది. దుకాణ సముదాయాలను చుట్టేసింది.

పాల్వంచలోని శ్రీనివాస కాలనీలోని రహదారిపైకి వర్షపు నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి 18వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు.

గోదావరి తగ్గుముఖం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం రాత్రి 11గంటలకు 47.80 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి 8గంటల వరకు 42.70అడుగులకు తగ్గింది.

కొత్తగూడెంలో (192.4 మి.మీ), ఇల్లెందులో(150.6), చుంచుపలి (147.6), లక్ష్మీదేవిపల్లి(121.2), అశ్వారావుపేట(111.6), అన్నపురెడ్డిపల్లి(105.4) వర్షం కురిసింది. అత్యల్పంగా భద్రాచలం (5 మి.మీ), ఆళ్లపల్లి (16.5), దుమ్ముగూడెం(18.4), బూర్గంపాడు(19.6) నమోదైంది. జిల్లాలోసాధారణ వర్షపాతం 9.6మి.మీ కాగా.. 75.6 మి.మీ కురవటం గమనార్హం. 688శాతం అధికంగా నమోదైంది. కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లు 3 ఎత్తి 15 వేల క్యూసెక్కుల వరదనీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. ఎగువన కురిసిన వర్షాలకు నీటిమట్టం 405.70 అడుగులకు చేరింది.

# సారథి.. ఏం తీరిది!

ఖమ్మం: రవాణా శాఖ సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'సారథి' వెబ్‌సైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 1నుంచి మూడో విడతలో నిజామాబాద్, ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లోని మొత్తం 10 ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు ప్రారంభించారు. జిల్లాలో ఖమ్మం, వైరా, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో నూతన సేవలకు సంబంధించి కేవలం ఒకే దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంపై అవగాహన, ప్రచారం కొరవడటమే దీని కారణమని స్పష్టంగా అర్థమవుతోంది.

దేశ వ్యాప్తంగా రవాణా శాఖ సేవలను సులభంగా పొందేందుకు వీలుగా కేంద్రం %www.sarathi.parivahan.gov.in% పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సైట్‌లో నమోదైన సేవలను దేశంలో ఎక్కడినుంచైనా పొందే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఓ రాష్ట్రంలోని వాహనాలు, వాహనదారుల సమాచారం మరో రాష్ట్రంలో తెలిసే అవకాశం ఉండదు. నూతన విధానంలో ఎక్కడి సమాచారం పొందొచ్చు. ప్రమాద సమయంలో వ్యక్తులు, వారి పూర్తి వివరాలు, వాహనాల సమాచారం తెలుసుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది.

రాష్ట్రంలో తొలి విడతగా రవాణా శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రయోగాత్మకంగా 'సారథి' అమలు చేశారు. రెండో విడతలో 13 ఆర్టీఏ కార్యాలయాలను ఎంపిక చేశారు.



తొలిరోజు వచ్చిన దరఖాస్తులు: 1

**సేవలు ఇలా..!**

వాహనదారులు, దరఖాస్తుదారులు వెబ్‌సైట్ హోం పేజీలోని డైలాగ్ బాక్సులో తెలంగాణ రాష్ట్రం పేరును ఎంపిక చేసుకోవాలి. తర్వాత అందించే అన్ని రకాల సేవలు పేజీలో కన్పిస్తాయి. అవసరమైనదాన్ని ఎంపిక చేసుకొని వివరాలు నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ పత్రాలతోపాటు సేవలకు సంబంధించిన ఆధార పత్రాలు రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి. అధికారులు పరిశీలించి అప్రూవల్ చేస్తారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సు సేవలు మాత్రమే అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ప్రచారం నిల్**

గత నెలలో సారథి వెబ్‌సైట్‌పై జిల్లా నుంచి ముగ్గురు ఉద్యోగులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత పోర్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ప్రచార విషయంలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్థానిక ఆర్టీఏ అధికారులంటున్నారు. గమనించాల్సిన అంశమేమిటంటే జిల్లాలోని ఉద్యోగులు, అధికారులకు సైతం సారథిపై పూర్తిస్థాయి అవగాహన కొరవడింది. ఫలితంగా తొలి రోజు కేవలం ఒకే దరఖాస్తు వచ్చింది. ప్రస్తుతం తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రభుత్వం, అధికారులు నూతన విధానంపై యుద్ధప్రాతిపదికన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

# స్థానిక సమరానికి కసరత్తు



పెద్దపల్లి : స్థానిక సమరానికి కసరత్తు వేగవంతమైంది. ఇప్పటికే పల్లె పోరు దిశగా ప్రక్రియ మొదలుపెట్టిన అధికారులు తాజాగా మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమాయత్తం అవుతున్నారు. పంచాయతీ ఓటర్ల ఆధారంగా ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 10 తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు. మరోవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక పోరు ప్రక్రియ ఊపందుకోవడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది.

**ఎంపీటీసీ స్థానం తగ్గింది**

జిల్లాలో 13 జడ్పీటీసీ, 137 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఒక ఎంపీటీసీ స్థానం తగ్గింది. సింగరేణి పునరావాస రామగిరి మండలం పెద్దంపేట ఎంపీసీటీ స్థానం రద్దయింది. ఇక్కడి నుంచి చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఓటర్లు తగ్గారు. ఇక్కడి ఓటర్లను సమీపంలోని జల్లారం స్థానంలో విలీనం చేశారు. ప్రతి మండల పరిషత్‌లో కనీసం అయిదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలి. ఈ నెల 6న ఎంపీటీసీ స్థానాలవారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా, 6-8 వరకు అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. 8న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం, 9లోపు అబసర్వం సిద్ధం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రాదేశిక పోరుకు సంబంధించి సర్వం సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలకు ఒకే బ్యాలెట్ పెట్టెలను వినియోగించనున్నారు.

జిల్లాలో 3,989 బ్యాలెట్ పెట్టెలు అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల సిబ్బంది జాబితా రూపొందించారు. 893 ప్రిసైడింగ్(పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారి(ఓపీవో) 2,756 మంది అవసరం కానుంది.

జిల్లాలో 573 పోలింగ్ కేంద్రాలుండగా వీటిలో 271 సమస్యాత్మకం, 301 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా నిర్ధారించారు. గత ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలుగా నిర్ణయించారు. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమవుతుండగా ఆశావహులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు ప్రధాన పార్టీలు వీటిపై దృష్టి సారించాయి. క్యేంతరాలు పరిష్కరించి 10న తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు.

# నిధులు కొరవడి.. నిర్వహణ తడ'బడి'



కరీంనగర్ : సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు నెలకొల్పుతూ ప్రభుత్వం విద్యాబోధనలో సంస్కరణలు తీసుకొస్తున్నా.. నిర్వహణకు నిధులు లేక ఆయా పాఠశాలల నిర్వహణ కొరవడుతోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలకు ఇప్పటివరకు ఏ నిధులూ రాలేదు. చాక్‌పీస్‌ల నుంచి పాఠశాలలో చిన్న చిన్న మరమ్మతుల వరకు చెల్లించడానికి పాఠశాలల్లో నిధులులేవు. ఏటా రెండు పర్యాయాలు నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు నయాపైసా కూడా అందించలేదు. దీంతో ఆయా బడుల ప్రధానోపాధ్యాయులు వారి జేబుల్లో నుంచి తీసి ఖర్చులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**రూ.6.17 కోట్లు రావాలి**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2367 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1.70 లక్షల వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రూ.6.17 కోట్ల నిధులు రావాల్సి ఉంది. వీటితోనే పాఠశాలల్లో మైనర్ మరమ్మతులు, స్టేషనరీ, ప్రయోగశాలల సామగ్రి, తాగునీరు, వివిధ కార్యక్రమాల నిర్వహణ, ఇతర బిల్లుల చెల్లింపులు జరపాలి. పాఠశాలల ప్రారంభం రోజు నాటికి కనీసం సగం నిధులైనా మంజూరు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలకు నిర్వహణ నిధులు మంజూరు కాలేదని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

క్రీడలపైనా నిర్లక్ష్యం క్రీడలను ప్రోత్సహించేందుకు సర్కారు బడులకు ప్రభుత్వం ఏటా చెల్లించే నిధులు రాలేదు. పరికరాల కొనుగోలు, శిక్షణ కార్యక్రమాల కోసం ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేల చొప్పున అందించాలి. మొత్తం రూ.2.44 కోట్లు నిధులు రావాల్సి ఉంది. ఓ వైపు పాఠశాలల క్రీడా సమాఖ్య పోటీలు ప్రారంభమవుతున్నాయి. విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నిర్వహణ భారం.. ఆగిపోతున్న చక్రం



మిర్యాలగూడ : మండలం సీత్యాతండా గ్రామ పంచాయతీ భవనం ఎదుట నిరుపయోగంగా ఉంచిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఇది. గత ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో మిర్యాలగూడ మండలంలో 46 పంచాయతీలు అయ్యాయి. వీటికి భవనాలు నిర్మించి ట్రాక్టర్లను అందించారు. కొంతకాలం బాగానే నడిచిన ట్రాక్టర్లు ప్రస్తుతం నిధుల లేమి కారణంగా నిరుపయోగంగా మారాయి. పాత మేజర్ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య అవసరాలకు వినియోగిస్తుండగా.. నూతన గ్రామాల్లో నిధులు లేక మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టిపోతున్నాయి. జిల్లాలో పల్లె పాలన పడకేసింది. పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం కోసం గ్రామ పంచాయతీకో ట్రాక్టర్‌తో పాటు నీళ్ల ట్యాంకర్‌ను 2019లో అప్పటి ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి సమకూర్చింది. పల్లెల రూపురేఖలు మార్చాలన్న సంకల్పంతో గ్రామాల్లో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేసింది. చెత్తాచెదారం కనిపించకుండా పారిశుద్ధ్య పనులు మురుగు కాల్వలు శుభ్రం చేయాలని స్పష్టం చేసింది. కానీ నిధుల లేమితో వాహనాల నిర్వహణ భారంతో ప్రస్తుతం ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది.

గుర్రంపోడు మండలం చేపూరు గ్రామపంచాయతీ ట్రాక్టరు ఇది. సర్పంచుల పాలనాకాలంలో ఇది బాగానే పనిచేసినా.. ఆరు నెలలుగా మూలన పడిందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో గ్రామంలోని చెత్తను తొలగించటం చాలా ఇబ్బందిగా మారిందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. ప్రస్తుతం సర్వీసింగ్ చేస్తే వినియోగంలోకి వస్తుందని పంచాయతీ కార్యదర్శి వినయ్‌కుమార్ చెబుతున్నారు.

నల్గొండ జిల్లాలో గ్రామ పంచాయతీకి జనాభా ఆధారంగా 844 ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లను, ట్యాంకర్లను సమకూర్చింది. బ్యాంకు రుణాలు(ఈఎంఐ) గ్రామ పంచాయతీనే చెల్లించాల్సి ఉంది. ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలకు ట్రాక్టర్ల నిర్వహణ అతిపెద్ద భారంగా మారింది. నిధుల లేమి కారణంగా డీజిల్ కొరత ఉండటంతో అవి నడవడం లేదు. నెలలో పది రోజులు, మరికొన్ని ప్రాంతాల్లో పదిహేను రోజులు ట్రాక్టర్లు నడిపిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో బాగు చేయించే నాథుడు లేక మూలకు చేరాయి. దీంతో గ్రామాల్లో అపరిశుభ్రం తాండవిస్తోంది. సొంత నిధులు ఖర్చు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నామని పేరు రాయడానికి ఇష్టపడని ఓ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉనికి కోసం ఆరాటం

కొత్తగూడెం : ఇప్పటికి రెండుసార్లు బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకుండా నేరుగా గనుల కేటాయింపుల కోసం ఎదురుచూసిన సింగరేణి పంథా మార్చుకుంది. వేర్వేరు రాష్ట్రాల్లో విభిన్న రంగాల్లో కాలుమోపిన సింగరేణి సొంత గడ్డపై ఉనికి కోసం పోరాడుతోంది. కేంద్రం నిర్వహించే గనుల కేటాయింపుల వేలంలో పాల్గొనేందుకు సిద్ధమవుతో ంది. త్వరలో దేశంలో 181 బొగ్గు బ్లాకుల వేలానికి కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఇందులో సింగరేణి బొగ్గు బ్లాకులు కూడా ఉన్నాయి. సింగరేణి గనులను ప్రైవేటీకరించబోమని కేంద్రం పలుమార్లు హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం భిన్నమైన పరిస్థితులున్నాయి. ఇప్పటికే రెండు పర్యాయాలు సింగరేణి గనులను వేలంలో పెట్టింది. కోయగూడెం, సత్తుపల్లి ప్రాంతాల్లో గనులను ప్రైవేటు యాజమాన్యాలు వేలంలో పాడుకున్నా వాటిని ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో వేలంలో పాల్గొనకుండా ఉంటే ఉనికికే ప్రమాదం అని భావించిన సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వేలంలో పాల్గొననుంది.



**కొత్త చట్టంతో తిప్పలు**

గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం- 2021 ప్రకారం భూగర్భ గనులపై పూర్తి అధికారాలు 2021 నుంచి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధించాయి. తన వాటా కూడా ఉన్నందున గతంలో సింగరేణి బొగ్గు బ్లాకుల జోలికి కేంద్రం వచ్చేదికాదు. 2014కు ముందు బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి బ్లాకులను మినహాయించేవారు. కానీ 2016 నుంచి చట్టానికి సవరణలు చేస్తూ చివరగా 2021లో కేంద్రం పార్లమెంటులో ఓ బిల్లును ప్రవేశపెట్టింది. 'ది మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ బిల్లు 2021' పేరుతో ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రకారం ఏ కంపెనీకైనా బొగ్గు బ్లాకును వేలం ద్వారానే కేటాయించాలి. నేరుగా కేటాయింపు పొందితే 14శాతం రాయల్టీ చెల్లించాలి. సవరణ బిల్లు ప్రకారం 2022నుంచి ఇప్పటికి రెడు పర్యాయాలుగా వేలంలో సింగరేణి గనులనూ చేరుస్తూ వస్తున్నారు. ప్రభుత్వ సంస్థలకు కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా కేంద్రం సింగరేణి గనులను వేలంలోనే పెడుతూ వస్తోంది. 'అనివార్యంగా వేలంలో పాల్గొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతిని అడిగాం. ప్రభుత్వం అనుమతితో వేలంలో పాల్గొంటాం. సంస్థను కాపాడుకొంటాం.' ఎన్.బలరాం, సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

# ఉత్తమ ఫలితాలకు పకడ్బందీ ప్రణాళిక

పాల్వంచ: విద్యార్థుల భవితకు తొలిమెట్టు పదో తరగతి. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సెప్టెంబరు 1 నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఏటా జనవరి నెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించటంతో పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు వెనకబడుతున్నారు. ఈ విషయం గమనించిన రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సెప్టెంబరు నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సోమవారం నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

**ఉదయం, సాయంత్రం నిర్వహణ**

రోజువారీగా ఉదయం 8 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఏ రోజు ఏ సబ్జెక్టు చదవించాలో షెడ్యూల్ విడుదల చేశారు. వారంలో సోమవారం ఉదయం సాంఘికశాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం బయాలజీ, సాయంత్రం ఇంగ్లిష్, గురువారం ఉదయం ఇంగ్లిష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం మ్యాథ్స్, సాయంత్రం ఫిజికల్ సైన్స్, శనివారం ఉదయం ఫిజికల్ సైన్స్, సాయంత్రం సోషల్ స్టడీస్ చదివించాలి. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి.



**వచ్చే నెల 10లోపు...**

పదో తరగతి సిలబస్ అక్టోబరులో 10వ తేదీలోపు పూర్తి చేయాలి. ఈ క్రమంలో తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రివిజన్ తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలి. ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి. ప్రత్యేక తరగతులను తరగతి గదిలో మాత్రమే నిర్వహించాలి. గ్రీన్‌బోర్డులతో పాటు డిజిటల్ బోర్డులను ఉపయోగించాలి. బృంద చర్చలు చేసుకొనే వెసులుబాటు కల్పించాలి. జిల్లాల వారీగా పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంఈఓలతో పాటు ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని అందించాం. వంద శాతం ఫలితాల కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా శ్రమిస్తాం. అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బి.నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి

# పైపైకి పాతాళగంగ

జగిత్యాల : జిల్లాలో జులై నెలాఖరున 4.49 మీటర్లుగా ఉన్న సగటు భూగర్భ జలమట్టం.. గత నెలాఖరు వచ్చేసరికి 3.61 మీటర్లుగా నమోదైంది. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 683 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 3 శాతం అధికంగా 700.8 మి.మీ వర్షపాతం నమోదు కావడం, ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీరు రావడంతో సగటు భూగర్భ జలమట్టం పెరిగింది. నెల రోజుల్లోనే 0.88 మీటర్లు పెరగడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**99 శాతం సాగు**

ఈ వానాకాలంలో 3,86,510 ఎకరాల్లో అన్ని రకాల పంటలను సాగు చేస్తారని అంచనాకాగా ఇప్పటివరకు 99.86 శాతంగా.. 3,85,955 ఎకరాల్లో అన్ని రకాల పంటలను విత్తుకున్నారు. ఈనెల మొదటి 15 రోజుల్లో పైర్ల సాగుకు అదను ఉండటంతో సాగు విస్తీర్ణం వందశాతం దాటనుంది. ప్రధాన పంట అయిన వరిలో ఇప్పటికే 3.13 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. కాగా ఈ మాసంలోనూ వర్షాల అంచనా, ఆయకట్టుకు కాలువ నీరు వస్తుండటంతో సగటు భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగనుంది. దీంతో వానాకాలం పంటల పూర్తితోపాటు.. యాసంగి పైర్ల సాగుకు ఉపకరించనుందని భూగర్భ జలవనరులశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ప్రాజెక్టులు, నదీ పరివాహకాల్లో వరదలు కొనసాగుతుండటం కలిసి వస్తోందని.. సాగుకు నీటి ఇబ్బంది ఉండదని వివరించారు.

# ఆకృతి లేకుండానే అంతస్తులు

ఖమ్మం: సాంకేతిక విద్యనభ్యసించిన యువతకు ఉపాధి కల్పించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం ఐటీహబ్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. నెలలు గడుస్తున్నా రెండో దశ పనుల్లో ఆశించిన పురోగతి లేదు. నిరంతరం పర్యవేక్షించాల్సిన రాష్ట్ర మౌలిక సదుపాయా ల కల్పన సంస్థ(టీజీఐఐసీ) అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. భవనానికి ఏఏ హంగులు కల్పించాలి, ఎలా నిర్మించాలో తెలిపే డిజైన్ లేక గుత్తేదారు సంస్థ ప్రతినిధులు తలపట్టుకుంటున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ నమూనాతో జీం2 వరకు నిర్మించి నిరీక్షిస్తున్నారు. ఇదీ ఖమ్మం జిల్లాకేంద్రంలోని ఐటీ హబ్-2 నిర్మాణ దుస్థితి.

**ఆగుతూ.. సాగుతూ..**

ఖమ్మం నగరాన్ని ఐటీకి నిలయంగా మార్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సకల హంగులతో ఐటీ హబ్-1 నిర్మించింది. ఇదీ సత్ఫలితాలివ్వటంతో మరికొన్ని కంపెనీలను రప్పించి మరింతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సంకల్పించింది. 2021, ఏప్రిల్ 2న ఐటీహబ్-2కు శంకుస్థాపన చేయగా.. ఏడాదిలోపు పూర్తి చేయాలని గడువు విధించారు. రూ.32 కోట్లతో జీప్లస్ 6 భవనం నిర్మించాల్సి ఉంది. శంకుస్థాపన చేసిన 22 నెలల తర్వాత టెండరు ఖరారు చేసి గుత్తేదారుకు బాధ్యతలు అప్పగించారు. ఏళ్లు గడుస్తున్నా.. భవనం తుదిరూపు దాల్చలేదు.

**పనులిక్కడే.. అధికారులక్కడ**

జిల్లాకేంద్రంలో టీజీఐఐసీ జోన్ కార్యాలయం ఉన్నా నిర్మాణ బాధ్యతలను వరంగల్ జోనల్ మేనేజర్‌కు అప్పగించారు. వీరు ఏఈ, డీఈని పంపించి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీం6లో సగం పనులూ పూర్తికాలేదు. బిల్లులు రావడం లేదని రెండు నెలలపాటు ఆపేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గత నెల 24 నుంచి మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటివరకు గ్రౌండ్‌ఫ్లోర్ ఎలా ఉండాలో తెలిపే డిజైన్ మాత్రమే ఇవ్వడంతో దాని ఆధారంగా మరో రెండు అంతస్తులు కట్టామని, పైఅంతస్తులు ఎలా కట్టాలో అర్థకావడం లేదని గుత్తేదారుల సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పుడు నిధులున్నా.. డిజైన్ లేకపోవడం ఆటంకంగా మారింది. అంతస్తులతో పాటు కింది భాగం నుంచి గోడలు నిర్మించాల్సి ఉది. ఈ ఇంకా మొదలుకాలేదు. జులై వరకు గడువు ఉండగా దాన్ని డిసెంబరు వరకు పెంచారు. ఆలోపు పూర్తయ్యే పరిస్థితి లేదు. త్వరగా పూర్తిచేస్తే.. కంపెనీలు వచ్చేవని, తమకు ఉద్యోగాలు దక్కేవని వందలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

**త్వరలో డిజైన్ రానుంది..: స్వామి, జోనల్ మేనేజర్, టీజీఐఐసీ వరంగల్**భవనం డిజైన్ చేసే కన్సల్టెంట్(గుత్తేదారు)కు కిడ్నీ దెబ్బతింది. రెండంతస్తుల వరకు



డ్రాయింగ్ ఉంది. మూడో అంతస్తుకు లేదు. డ్రాయింగ్ ఆలస్యం కావడంతో పాత కన్సల్టెంట్ మరొకరి సాయంతో డిజైన్ రూపొందిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల్లో రానుంది. డిసెంబరులోపు భవన నిర్మాణం పూర్తిచేస్తాం.

# ఆటలపై.. చిగురిస్తున్న ఆశ!


చేగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు ఆటలు ఆడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో పీఈటీ పోస్టులు లేకపోవడంతో చిన్నారులు ఆటలకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, అవసరమైతే కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని విద్యాశాఖకు సూచించారు. ఈ ఆదేశాలను అమలు చేస్తే జిల్లాలో పీఈటీలు లేని జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలలకు మేలు జరుగుతుంది.

రాణించాలంటే: క్రీడల్లో రాణించాంటే ప్రత్యేక శిక్షణ అవసరం. వ్యాయామ ఉపాధ్యాయుల తర్ఫీదులో సాధన చేస్తే నైపుణ్యాలు పెంచుకునే అవకాశం ఉంటుంతి. జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల విద్యార్థులు ఉన్నా, సరైన తోడ్పాటు లేక ముందుకు సాగలేకపోతున్నారు. జాతీయ పండుగల సమయంలో మాత్రమే నామమాత్రంగా ఆటలు ఆడిస్తున్నారు. జిల్లాలో పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులే లేవు. ఇక ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదే పరిస్థితి. జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు ఉన్నా, ఆటల్లో ప్రావీణ్యం చూపడంలేదు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండల స్థాయిలో ఆడుతూ.. ఓటమి చెంది నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు. అదే వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే వారు క్రీడల్లో కఠినమైన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పీడీలు, పీఈటీలు ఉన్న పాఠశాలల నుంచే ఎక్కువ మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వరకు ఎదుగుతున్నారు. పీఈటీ పోస్టులను మంజూరు చేయాలని కోరుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తాజాగా సీఎం ఆదేశాలు అమలైతే చిన్నారులకు మేలు జరగనుంది.

జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుల వివరాలు

జడ్పీ ఉన్నత పాఠశాలలు: 146
ప్రాథమికోన్నత: 128
పీడీలు ఉన్న పాఠశాలలు: 61
పీఈటీలు ఉన్నవి : 8
ఖాళీగా ఉన్నవి: 2
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐ): 15
పీఈటీ పోస్టులు లేని జడ్పీ పాఠశాలలు: 62
పీఈటీ పోస్టులు లేని యూపీఎస్‌లు: 128

# ట్రాఫిక్ చక్రబంధంలో మహానగరం



హైదరాబాద్: ఐదోరోజు కావటంతో అధికశాతం మండప నిర్వాహకులు గణపతుల ఊరేగింపుతో బయల్దేరారు. కావడం, వినాయకుల ఊరేగింపులతో మహానగరం ట్రాఫిక్ చక్రబంధంలో విలవిల్లాడింది. సాధారణ సమయాల్లో అరగంట పట్టే ప్రయాణం గంటన్నర వెచ్చించాల్సి వచ్చిందని వాహనదారులు తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయం వైపు నుంచి బంజారాహిల్స్/జూబ్లీహిల్స్ మార్గాల్లో సాయంత్రం వరకు పెద్దఎత్తున వాహనరద్దీ కనిపించింది. దీని ప్రభావంతో రాయదుర్గం, టోలిచౌకి, లక్డీకపూల్, ఖైరతాబాద్ వరకూ వాహనాలు బారులు తీరాయి.

గ్రేటర్‌లో నిమజ్జనం సందర్భంగా మూడు విడతల్లో 14,486 మంది పారిశుద్ధ్య సిబ్బంది పనిచేయనున్నారు.

నగరంలో 303 కిలోమీటర్ల ప్రధాన రోడ్డు మార్గంలో ఊరేగింపు సజావుగా సాగేలా ఏర్పాట్లుపూర్తి చేశారు. ꞉ఊరేగింపు మార్గాల్లో గుంతలు పూడ్చగతో పాటు ఆ మార్గాల్లో చెత్త వేయడానికి గార్బేజీ పాయింట్లు ఏర్పాటు చేశారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నెక్లెస్‌రోడ్డు మార్గంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

**పోలీసు యంత్రాంగం సిద్ధం**

ఈ నెల 6న మహానిమజ్జన ఘట్టం విజయవంతంగా పూర్తిచేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది.

నగర కొత్వాల్ సీవీ ఆనంద్ స్వయంగా అర్ధరాత్రి వినాయక విగ్రహ మండపాలను ఆకస్మికంగా సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణనాథుడి దర్శనానికి లక్షలాది మంది భక్తులు వస్తున్నారు. మహాగణపతి నిమజ్జనం చూసేందుకు సైతం భారీగా జనం వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, రవీంద్రభారతి, బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో భద్రతకు సుమారు 3 వేల మంది పోలీసులను కేటాయించినట్టు సమాచారం. అవసరమైతే రంగంలోకి దింపేందుకు అదనపు బలగాలను సిద్ధంగా ఉంచారు

నగరం, శివారు ప్రాంతాల నుంచి ట్యాంక్‌బండ్ వరకూ ఊరేగింపు జరిగే మార్గాల్లో విద్యుత్ తీగలు, చెట్లకొమ్మలు, ఆక్రమణలను తొలగిస్తున్నారు.

# ఉత్పత్తిలో వెనుకంజ



గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆగస్టు నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు. లక్ష్యానికి 8.2 లక్షల టన్నుల వెనుకంజలో ఉంది. గత నెలలో కురిసిన వర్షాలకు ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడింది. దీంతో 4.82 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 4.00 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. దీని ప్రభావం అయిదు నెలల బొగ్గు ఉత్పత్తిపై కూడా పడింది. గడిచిన అయిదు నెలల్లో సంస్థ 25.64 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 24.19 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. దీంతో 1.45 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకంజలో ఉంది. సింగరేణి వ్యాప్తంగా 94 శాతం బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది.

**మూడు డివిజన్లలో వంద శాతం**

సింగరేణి వ్యాప్తంగా మూడు డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. ఆగస్టు నెలలో కొత్తగూడెం, ఆర్జీ-1, 2, డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. అయిదు నెలల ఉత్పత్తిలో కూడా కొత్తగూడెం, ఆర్జీ-2, మణుగూరు డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించాయి. మిగతా అన్ని డివిజన్‌లు తక్కువ స్థాయిలోనే బొగ్గు ఉత్పత్తి చేపట్టాయి. కేవలం ఒక్క ఆగస్టు నెలలోనే 8.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఈనెలలో వర్షాలు ఎక్కువగా కురవడంతో ఉపరితల గనుల్లో పనులు నిలిచిపోయి ఉత్పత్తిపై ప్రభావం పడింది.

**ఏడు నెలల్లో 56.81 మిలియన్లు**

రానున్న ఏడు నెలల్లో 56.81 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఈ ఏడాది 76 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయిదు నెలల్లో 24.19 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి రానున్న ఏడు నెలల్లో 56.81 మిలియన్ టన్నులను వెలికి తీస్తేనే వార్షిక లక్ష్యాన్ని చేరుకునే అకాశం ఉంది. వార్షిక ఉత్పత్తి లక్ష్యం సాధించాలంటే నెలకు 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నెలకు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంటున్న సింగరేణి రానున్న కాలంలో నెలనెలా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

# జనం మారాలి.. జ్వరాలు తగ్గాలి



సిరిసిల్ల : వర్షాల నేపథ్యంలో జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. ఆవాసాల్లో అపరిశుభ్రత పెరిగి, తొట్టిలు, పాడైపోయిన వస్తువుల్లో నీరు చేరింది. అందులో పుట్టి పెరిగిన లార్వాలు దోమలుగా మార్పుచెంది జనాలపై దండెత్తుతున్నాయి. దీనికి నిధుల కొరత వెరిసి పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఫలితంగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా యంత్రాంగం డ్రై డేపై అవగాహన కల్పించినప్పటికీ జనాల్లో పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందక రోగాల బారిన పడుతున్నారు.

**మార్పు రావాలి....**జిల్లాలోని 260 గ్రామ పంచాయతీల పరిధిలో 5.5 లక్షల జనాభా ఉంది. 470 మంది ఆశా కార్యకర్తలతో వానాకాలంలో జ్వర సర్వే చేపడుతున్నారు. 1.7 లక్షల ఇళ్లను సందర్శించి జ్వర పీడితుల వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. జ్వర లక్షణాలను పరిగణలోకి తీసుకుని వారికి రక్తపరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. అదే సమయంలో వానలతో పరిసరాల పరిశుభ్రత, డ్రై డే ప్రాముఖ్యాన్ని వివరిస్తున్నారు. దోమలతో కలిగే దుష్ఫలితాలను చెబుతున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. దోమలను నిర్మూలించాలంటే తొట్టిల్లో నీటిని ఒక రోజు ఖాళీ చేయడం తప్పనిసరి. ఇలా చేయడంతో లార్వా నశించి దోమల వ్యాప్తి తగ్గుతుంది. కానీ క్షేత్ర స్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. రోజుల తరబడి నీటి నిల్వలను ఖాళీ చేయకపోవడంతో మశకాలు పెరుగుతున్నాయి. వాటి కాటుకు గురైన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు ఎక్కువవుతున్నాయి.

**ఇవి ముఖ్యం**

జ్వరాలు తగ్గాలంటే జనాల్లో మార్పు రావాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు నీటి నిల్వ ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయాలి. దోమ తెరలు, మస్కిటో రిపలెంట్స్ వాడాలి. ఆరుబయట వేసిన వాహనాల టైర్లు, కొబ్బరి బోండాలు, కూలర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాల్లో వాన నీరు చేరుతుంది. ఇది డెంగీ దోమ పెరిగేందుకు అనుకూలంగా ఉంటాయి. అలాంటి వస్తువులను గుర్తించి చెత్త సేకరణ వాహనానికి అప్పగించాలి. చిన్న, పెద్ద తేడా లేకుండా జ్వరం వస్తే స్వీయ చికిత్సను మానుకోవాలి. పసి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలను ఆయా ఉప కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బందికి తెలపాలి. **32 డెంగీ కేసులు!**

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 32 డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. 14 హైరిస్క్ ఏరియాలుగా అధికారులు ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో మహమ్మారి దోమ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నారు. మూడు ర్యాపిడ్ యాక్షన్ బృందాలను అందుబాటులో ఉంచారు. ఇటీవల వీర్నపల్లి మండలం కంచర్ల, రాశిగుట్టతండాలో పది కేసుల వరకు బయటపడ్డాయి. దీనికి ప్రధాన కారణం పారిశుధ్య లోపమే. పరిసరాల్లో నీటి నిల్వల్లో పెరిగిన కీటకం చాలా మందిని కాటేయడంతో డెంగీ బారిన పడ్డారు.

# ముందు ఒక ముఠా.. వెనకాలే అసలు ఆట!

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుకను సత్తుపల్లికి తరలిస్తున్నారు. వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల పోలీసుల దాడుల్లో లారీలు పట్టుబడుతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిరంతరం ఇసుక దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్న ఇసుకనూ ఇతర గుత్తేదార్లు, బిల్డర్లకు రవాణా చేస్తూ భారీగా సొమ్ము దండుకుంటున్నారు.

**అధిక లోడుతో ఇసుక తరలిస్తూ..**

30 టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్లలో, లారీల్లో 50 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇటీవల సత్తుపల్లి, వేంసూరులలో ఎంవీఐ దాడులుచేసి కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో 8 లారీలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అధిక లోడుతో రోడ్లు సైతం శిథిలమవుతున్నాయి.

**అక్కడ 150.. ఇక్కడ 1300**

ఏపీలో ఇసుక టన్ను రూ.150కి కొనుగోలు చేస్తూ సత్తుపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారంలో లారీల యజమానులకు వినియోగదారులకు మధ్య దళారీలు పుట్టుకురావడంతో దందా మరింత పెరిగిపోయింది. దళారులు ఇసుక లారీలకు ఒక్కో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కమీషన్లు దండుకొంటున్నారు.



**వేంసూరు మీదుగా పలు దారుల్లో..**

ఏపీలోని విజయవాడ నుంచి ఇసుకను పలు మార్గాల ద్వారా వేంసూరు మీదుగా తరలిస్తున్నారు. అడపాదడపా వేంసూరు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. రవాణా ఆగడంలేదు. ఎక్కువగా రాత్రుళ్లు తరలుతున్న లారీలకు ఎస్కార్ట్‌గా కొందరు వ్యక్తులు ముందుగా ప్రయాణిస్తూ పోలీసులు లేరని నిర్ధారించాక రవాణా సాగుతోంది. కేసులు నమోదు చేస్తే పలుకుబడితో కొందరు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కేవలం లారీలపైనే కాకుండా దళారీ వ్యవస్థనూ నిరోధించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సత్తుపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్లపై పలుమార్లు కేసులు నమోదు చేశామని ఏసీపీ ఎ.రఘు తెలిపారు. ప్రస్తుతం పలు మార్గాల్లో గస్తీని పెంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు.

# రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఖమ్మం: పూర్తి మెట్ట ప్రాంతమైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులు నింపి సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచేందుకు ఉద్దేశించిన బుగ్గవాగు ప్రాజెక్టు 20 ఏళ్లుగా కాగితాల్లోనే మగ్గుతోంది. ఉన్నత స్థాయిలో హైడ్రాలిక్ క్లియరెన్స్‌లు వచ్చినా ప్రాజెక్టు నిర్మాణం కొలిక్కిరావటం లేదు.

బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రావిటీ ద్వారా నీరు మళ్లించేందుకు కాలువలు తవ్వాలని, ఇందుకు భూసేకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదించారు. రూ.40 కోట్ల అంచనాతో టెండర్లు నిర్వహించారు. 25 కి.మీ. పొడవున కాలువలు తవ్వేందుకు సుమారు 100 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు అంగీకరించలేదు. భూములివ్వమని ఏజెన్సీలో గిరిజనులు ససేమిరా మొండికేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసేకరణకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు నిర్మించి నీటిని తరలించే అవకాశాలు పరిశీలించాలని ఇటీవల ఆదేశించారు. భూమిలో పైపులైన్ నిర్మించి నీటిని మళ్లించేందుకు తాజాగా రూ.97 కోట్ల అంచనాతో ప్రతిపాదన రూపొందించి పంపించారు. **గత ప్రతిపాదనలు రద్దు..** గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఖమ్మంకు చెందిన గుత్తేదారు ఇటీవల ఒప్పందం రద్దు చేయాలని అధికారులకు లేఖ అందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక పంపారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నూతన ప్రతిపాదనలూ ప్రభుత్వానికి అందించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి.



**ప్రాజెక్టు స్వరూపం**

సింగరేణి మండలం గేట్ కారేపల్లి సమీపంలో బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి. అక్కడి నుంచి నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 31 చెరువులకు మళ్లించటం ద్వారా సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. కామేపల్లి మండలంలో పింజరమడుగు, నెమలిపురి, గోవింద్రాల, కొమ్మినేపల్లి, రఘునాథపాలెం మండలం కోటపాడు, పాపటపల్లి, కోయచెలక, శివాయిగూడెం, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీటిని మళ్లిస్తారు. ఇందుకు 38 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించనున్నారు.

**ప్రధానంగా కామేపల్లికి..**

సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల రూపంలో 30పైచిలుకు చెరువులకు సాగర్ నీరు అందించే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఈ ఎత్తిపోతలలో లబ్ధి పొందే కొన్ని చెరువులు పూర్వ బుగ్గపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్నా రెండు పథకాల రూపంలో కరవు నేలకు రెండు పంటలా నీరందే అవకాశం ఉంది. అంతకంటే ముఖ్యంగా ఎలాంటి నీటి వనరులేని కామేపల్లి రైతులకు బుగ్గపాడు ప్రాజెక్టు ఎంతో అవసరం.

# డెంగీ పంజా

కరీంనగర్ : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు తీవ్ర జ్వరంతో బాధపడగా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డెంగీ పాజిటివ్ రావడంతో వారం కిందట చికిత్స తీసుకున్నారు. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మహిళ జ్వరంతో బాధపడుతుండగా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఏటా వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలడం సర్వసాధారణం. ప్రస్తుతం జిల్లాలో సాధారణ జ్వరాలతో పాటు డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది మందికి నిర్ధారణ అయింది. వారిలో ఇద్దరు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నలుగురు ప్రభుత్వ, ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతుండటంతో జిలావ్యాప్తంగా ఆందోళన నెలకొంది.

**ఆయా ప్రాంతాల్లో ఇలా..**

మానకొండూర్ నియోజకవర్గ పరిధిలో అన్నారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ముగ్గురు డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అధికారులు



అల్ఫాసైఫర్ మెత్రిన్ అనే దోమల మందును మంగళవారం పిచికారీ చేయించారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో ఒకరు, కరీంనగర్‌లోని లక్ష్మీనగర్, సంతోష్‌నగర్, మెహర్‌నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో మలేరియా వైద్య విభాగం అధికారులు జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సర్వే చేసి వైద్య శిబిరాలు నిర్వహించారు.పలు రకాల దోమల మందులను పిచికారీ చేయిస్తూ ఇళ్లు, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నారు. సర్వే నిర్వహించి సాధారణ జ్వర బాధితులకు మందులు అందజేస్తున్నట్లు మలేరియా విభాగం అధికారులు తెలిపారు.

**జాగ్రత్తగా ఉండాలి**

వర్షాకాలంలో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లార్వాలు పెరగకుండా దోమలమందు పిచికారీ చేయిస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోతే చర్యలు తీసుకుంటాం. డెంగీ పాజిటివ్ వస్తే కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందిస్తాం. వసతి గృహాల్లోనూ వైద్య శిబిరాలు, జ్వర సర్వేలు చేస్తున్నాం. జ్వరాలు ఎక్కువైతే వెంటనే ఆశా కార్యకర్తలకు లేదా ఏఎన్ఎంలకు సమాచారం ఇవ్వాలి. నిర్లక్ష్యం వహించకుండా సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కరీంనగర్

# నిర్లక్ష్యపు నీడలో వైకుంఠధామాలు

ధర్మపురి : జిల్లాలో పలు వైకుంఠధామాలు నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్నాయి. గోదావరి తీరంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలను ఉపాధిహామీ, ఇతర నిధులతో నిర్మించారు. అయితే గోదావరి ఉప్పొంగినప్పుడల్లా క్రమంగా ఇవి నీటిలో మునిగిపోవడం.. మరోవైపు స్థానిక పురపాలక, పంచాయతీ సిబ్బంది నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మపురి, బీర్‌పూర్, వెల్గటూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో గోదావరి తీరానే నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వరదలతో నామరూపాల్లేకుండా..**

గోదావరి తీరంలోనే శ్మశాన వాటికలను నిర్మించడం ఇంజినీర్ల లోపభూయిష్టమైన విధానమేనని భావిస్తున్నారు. ఏటా వరదలతో నామరూపాల్లేకుండా పోతున్నాయి. కొంతదూరంలో నిర్మించాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. దమ్మన్నపేట, ఆరెపల్లి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు వరదలకు అధ్వానస్థితికి చేరాయి. వీటిని మరమ్మతు చేయాలనే ఆలోచన అధికారులు చేయడంలేదు.రూ.కోటి వెచ్చించి ఆధునిక వసతులతో ధర్మపురి గోదావరి తీరంలో నిర్మించిన వైకుంఠధామం అస్తవ్యస్తంగా తయారైంది. కనీస సదుపాయాలు కరవయ్యాయి. ఆధునిక వసతులతో నిర్మించిన నాలుగు గదుల తలుపులను ఆకతాయిలు పగులగొట్టారు. బోరు వేయించినా మోటారు ఏర్పాటు చేయలేదు. ఎటువైపు చూసినా పిచ్చి మొక్కలు, ధ్వంసమైన తలుపులు కనిపిస్తున్నాయి. మందుబాబులకు అడ్డాగా మారగా.. ప్రహరీ దెబ్బతింది.

**అన్నిచోట్లా అరకొర వసతులే**

జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాల్లోని శ్మశాన వాటికలు అరకొర వసతులతో నెట్టుకొస్తున్నాయి. మెట్‌పల్లిలో ప్రహరీ, బోరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ నీటిపై ఆధార పడాల్సివస్తోంది. కోరుట్ల, గొల్లపల్లి, వెల్గటూర్ తదితర ప్రాంతాల్లోని వాటికి వసతులు కరవయ్యాయి. ధర్మపురి వైకుంఠధామంపై పురపాలక కమిషనర్ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా.. త్వరలోనే పరిశుభ్రత పనులు చేపట్టి వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు.

# అంచుల్లో కోతలు.. నిలవని నీళ్లు

కోదాడ : భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం నదులపై చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టింది. ఈ నిర్మాణాలు నాణ్యతగా లేకపోవడంతో అంచులు కోతకు గురయ్యాయి. దీంతో చెక్ డ్యాం నిర్మించినా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. జిల్లాలో ప్రధానమైన మూసీ, పాలేరు నదులపై ఉన్న చెక్ డ్యాంల అంచులు కోతకు గురయ్యాయి. జిల్లా నుంచి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండటంతో అసంపూర్తి చెక్ డ్యాం నిర్మాణాల్లో కదలిక వచ్చే అవకాశం ఉంది.వినియోగంలోకి రాక..

2019–20 సంవత్సరంలో చెక్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం కాగా, చాలా ప్రాంతాల్లో పూర్తి కాలేదు. అంతలోనే అంచులు కొట్టుకుపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటికి నిధులు కేటాయించకపోవడంతో మిగతా పనులు పూర్తి కాలేదు. పాలేరు వాగుపై అనంతగిరి మండలంలోని శాంతినగర్ సమీపంలో సుమారు రూ.3 కోట్లు, పాలారం గ్రామ సమీపంలో సుమారు రూ.2.80 కోట్లు, గొండ్రియాల సమీపంలో రూ.2.34 కోట్లు, కోదాడ రూరల్ పరిధిలోని రెడ్లకుంట పరిధిలో రూ.2.70 కోట్లతో, మోతె మండలంలో మరో రెండు చెక్‌డ్యాంలు నిర్మించారు. మూసీనదిపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండలం ఎల్లారం, సోమారం గ్రామ పరిధిలో, పాలకవీడు మండలంలోని రాఘవాపురం, శూన్యపహాడ్, మూసిఒడ్డుసింగారం, మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం, గుర్రంపోడుతండా సమీపంలో నిర్మించిన చెక్ డ్యాంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# తడి.. పొడి.. ఆచరణలో తడబడి



జగిత్యాల : పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల పునర్వినియోగానికి తడి పొడి చెత్త సేకరణ విధానం అమలు చేస్తున్నారు. కాగా జగిత్యాల పట్టణంలో తడి పొడి చెత్త సేకరణ పూర్తిగా నిర్వీర్యమైంది. సరిపడా సిబ్బంది, వాహనాలున్నా అవగాహన లోపం, బాధ్యతా రాహిత్యంతో అమలులో చతికిలపడింది.

**వనరులున్నా నిరుపయోగం**

48 వార్డుల్లో ఇంటింటా చెత్త సేకరణకు 68 వాహనాలున్నాయి. పారిశుద్ధ్య విభాగంలో 262 మంది సిబ్బంది పని చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే క్రమంలో కార్మికులకు శ్రమ లేకుండా వాహనాల్లోనే ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువు తయారీ కోసం 2020లో పట్టణ ప్రగతి నిధులతో నూకపల్లి డంపు యార్డులో ప్రత్యేక షెడ్డు నిర్మించారు. మొదట్లో 4 వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని అమలు చేసిన అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు.

**నాడు రాష్ట్రంలోనే ప్రథమం**

పురపాలిక పరిధిలో సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. దీన్ని స్థానికంగా మొక్కల పెంపకంతో పాటు అవసరమైన వారికి అందజేయాల్సి ఉంటుంది. 2012లో అధికారుల కృషితో తడి, పొడిలో జగిత్యాల బల్దియా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. ఆ తరువాత వచ్చిన అధికారుల్లో చిత్తశుద్ధి లేక ప్రక్రియ పడకేసింది. పట్టణంలో నిత్యం 10 మెట్రిక్ టన్నుల తడి చెత్త, 8 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 4 టన్నుల మురుగు వ్యర్థాలు పోగవుతున్నాయి.

**ఇవీ కారణాలు**

తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతుండటంతో సిబ్బంది ఒకే డబ్బాలో వేసుకొని వెళ్తున్నారు.

పొడి చెత్తను పట్టణ సమాఖ్య తీసుకొని నగదు చెల్లిస్తుండటంతో తడి చెత్తపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా కేటాయించిన పర్యావరణ ఇంజినీర్‌కు హరితహారం బాధ్యతలు అప్పగించడంతో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన లేకపోవడంతో నామమాత్రంగా మారింది.

పురపాలిక సమాచారం

వార్డులు: 48, పట్టణ జనాభా: 1.20 లక్షలు

నిత్యం సేకరించే చెత్త: 70 మెట్రిక్ టన్నులు

వినియోగించే వాహనాలు: 68

మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది: 262

ప్రజలకు అవగాహన కల్పిస్తాంపట్టణంలో ఉత్పత్తి అవుతున్న చెత్త నుంచి 65 శాతాన్ని సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు ప్రాధాన్యమిస్తున్నాం. వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొన్ని వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం. శ్రీకాంత్, పర్యావరణ అధికారి

# పల్లెల స్వచ్ఛతకు పెద్దపీట



సారంగాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా రద్దీ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు, ప్రార్థన మందిరాలు, పర్యాటక ప్రదేశాలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, మార్కెట్‌లతోపాటు రద్దీ ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలమున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో పనులు ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 70 శాతం నిధులు చెల్లిస్తుండగా.. 30 శాతం పంచాయతీ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెచ్చించనున్నారు. పనుల పర్యవేక్షణ, కొలతలకు సంబంధించి ఉపాధి హామీ పథక అధికారులు చూడనున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పలు ప్రదేశాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. కొన్ని పూర్తవగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

**నిర్మించే మండలాలివే..**

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రూ.3 లక్షలతో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఇందులో రూ.2.10 లక్షలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద చెల్లిస్తుండగా, మిగతా రూ.90 వేలు ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు చేయనున్నారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం అర్పపల్లి, పెంబట్ల.. గొల్లపల్లి మండలం తిర్మలాపూర్.. కొడిమ్యాల మండలం నాచుపల్లి.. పెగడపల్లి మండలంలో లింగాపూర్, పెగడపల్లి.. కథలాపూర్ మండలంలో తాండ్ర్యాల, పెగ్గెర్ల, గంభీర్‌పూర్.. రాయికల్ మండలంలో బోర్నపల్లి, కొత్తపేట.. వెల్గటూర్ మండలంలో కోటిలింగాల.. మల్యాల మండలంలో ముత్యంపేట.. కోరుట్ల మండలం అయిలాపూర్‌తో పాటు మల్లాపూర్, మేడిపల్లి, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ఆలయ ప్రాంతాలు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు నిర్మిస్తున్నారు.

**త్వరితగతిన పూర్తి చేసేలా ఆదేశాలు**

రద్దీ ఉన్న ప్రాంతాల్లో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి అవసరాల మేరకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎంపిక చేసిన పలు ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. డీఆర్డీఏ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. వీటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. రఘువరన్, డీఆర్డీవో

# గుట్టలన్నీ గుల్ల



సిరిసిల్ల: జిల్లాలో పలుచోట్ల అక్రమ మైనింగ్‌తో గుట్టలు గుల్లబారుతున్నాయి. వాస్తవానికి మట్టితవ్వకాలకు అనుమతుల లేవు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు ఇస్తున్నాయి. వీటిలోనూ అనుమతికి మించి, హద్దులు దాటి కొండల్ని కరిగిస్తున్నారు. రూ.కోట్ల విలువైన మట్టిని, రాళ్లను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాదు.. జీవవైవిధ్యం దెబ్బతింటోంది. వేములవాడ, పెద్దూరు పరిసరాల్లో వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఆది మానవుల అవాస ప్రాంతాలనూ ధ్వంసం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా మైనింగ్ దందాలో విస్మయకర వాస్తవాలు వెలుగు చూశాయి.

**ఇదీ పరిస్థితి**వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ, అనుపురం, రుద్రవరం గ్రామ శివారులో రాజరాజేశ్వర జలాశయం వెనకాల నల్ల మట్టి, మొరం దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి, సిరికొండ, బోయినపల్లి మండలం అదనపు టీఎంసీ కాల్వ మట్టి, సిరిసిల్ల సమీపంలో ఎద్దుగుట్ట, మైసమ్మగుట్టలు, ఎల్లారెడ్డిపేట వెంకటాపూర్, కోరుట్లపేట, గొల్లపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని అటవీ సమీప గ్రామాల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి.సమాచారం వచ్చినప్పుడు మాత్రం రెవెన్యూ, పోలీసుల తనిఖీల్లో వాహనాలను పట్టుకుంటున్నారు. కేసు నమోదు చేయడం, దానికి రెవెన్యూ అధికారులు చలానాతో జరిమానా కట్టిస్తున్నారు. జిల్లాలో రెండు నెలల్లో రూ.3.89 లక్షల జరిమానాలు వసూలు కావడం గమనార్హం. అసలు తవ్వకాలు ఎక్కడ జరుగుతున్నాయి? వాటిపై నిఘా వ్యవస్థ లేకపోవడం అక్రమార్కులకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. రెవెన్యూ అధికారులు మామూలుగా తీసుకోవడం. మైనింగ్‌లో సిబ్బంది కొరతను సాకుగా చూపి అటుగా వెళ్లట్లేదు. ఇది అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇలా తరలిస్తున్న మట్టిని రియల్ వెంచర్లకు వినియోగిస్తున్నారు. చాలా వరకు అటవీ సమీపంలోని గుట్టలను, ప్రభుత్వ భూములను చదునుచేసి పంట భూములుగా మార్చుతున్నారు.**జీరో వేబిల్లు ఏమైంది?**

మట్టి తవ్వకాలకు ప్రభుత్వం జీరో వేబిల్లు విధానం తీసుకొస్తే అక్రమార్కులకు కొంతవరకైనా అడ్డుకట్టపడుతుంది. రెండేళ్ల క్రితం మైనింగ్‌శాఖలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మండలాల వారీగా రెవెన్యూశాఖ మట్టి క్వారీలకు గుర్తించాలి. వాటిలో తవ్వకాలకు నిరభ్యంతరాలు తెలపాలి. ఈ సాఫ్ట్‌వేర్ ప్రక్రియ ప్రాథమిక దశలోనే నిలిచిపోయింది. ప్రభుత్వ నిర్మాణాలకు పని అంచనాల్లో మట్టి వినియోగం మేరకు బిల్లులు చెల్లించే క్రమంలో సెస్ రూపంలో తీసుకుంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ అవసరాలకు మించి పక్కదారి పడుతోంది. రెవెన్యూ, గనులశాఖ అనుమతితో మట్టి క్వారీల నుంచి తవ్వుకునే అవకాశం ఉంది. దీనికి క్యూబిక్ మీటరుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.

# టెండర్ నిర్వహణ.. ఒప్పందం విస్మరణ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో రూ.50 కోట్ల మేర పనులు చేసేందుకు సాధారణ నిధులతో టెండర్లు పిలిచారు. డివిజన్లలో నిలిచిపోయిన రోడ్లు, మురుగుకాలువలకు సంబంధించిన పనులు చేసుకోవడానికి గత పాలకవర్గ సభ్యులు తీర్మానం కూడా చేశారు. ఆ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకొస్తుండగా.. ఒప్పందం చేసేందుకు కొందరు ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు.

**గుత్తేదారులు డీడీలు చెల్లించినా..**

అభివృద్ధి పనులు చేసేందుకు గుత్తేదారులు డీడీలు కూడా చెల్లించారు.



ఆ మొత్తం బల్దియా ఖజానాలో జమ అయినప్పటికీ ఒప్పందం చేసే ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు. అలా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కాక గుత్తేదారులు అయోమయంలో పడుతున్నారు. కొన్ని చోట్ల పనులు కూడా ప్రారంభించగా ఒప్పందం చేసుకోకుండా ఎలా చేస్తారని బెదిరింపులకు గురి చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

**అధికారుల వద్దే దస్త్రాలు**

టెండర్ నిర్వహించి ఒప్పందం చేసుకోవాల్సిన దస్త్రాలు ఇంజినీరింగ్ అధికారుల వద్దే ఉన్నాయి. ఓ వైపు రహదారులు మురుగుకాలువల పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కొందరు ఇంజినీర్లు మాత్రం మోకాలడ్డు పెట్టడం వివాదాస్పదంగా మారుతోంది. పనులు చేయకుండా ఆపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న మాజీ పాలకవర్గ సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

**కమిషనర్ ఆదేశాలతో..**

ప్రాధాన్యం ప్రకారం పనులు చేయాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. సాధారణ నిధులతో గతంలో చేపట్టిన పనులకే రూ.కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. సంజయ్‌కుమార్, ఈఈ, నగరపాలిక

# సంపుతున్నయ్ జాగ్రత్త

సిరిసిల్ల : కుళాయి నీటిని ఒడిసిపట్టేందుకు ఇళ్ల ఆవరణలో సంపులు నిర్మిస్తుంటారు. ఈ మధ్య ప్రతి ఇంటికి ఇవి తప్పనిసరిగా మారాయి. తొట్టిల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, నీటితో ఆడుకునేందుకు ఇష్టపడే చిన్నారుల పాలిట మృత్యువుగా మారుతున్నాయి. ఎద్దడిలో నీటి నిల్వకు ఏర్పాటు చేసుకున్న తొట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రదేశాల్లో నీటితొట్టిలు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేసేలా సంబంధిత పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు పర్యవేక్షణ చేయాలని.. నిర్లక్ష్యం చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త**

బాల్యంలో చిన్నారులు నీటితో ఆడుకునేందుకు ఇష్ట పడుతుంటారు. అదే భావనతో తెరిచి ఉన్న నీటి సంపుల వద్దకు వెళ్లి ఆడుకునే క్రమంలో అందులో పడిపోతున్నారు. సంపుకు దూరంగా ఉండేలా చిన్నారులకు భయం చెప్పాలి. పెద్ద పిల్లలయితే అందులో పడితే జరిగే ప్రమాదంపై అవగాహన కల్పించాలి. జ్ఞానం రాని చిన్నారులపై నిత్యం తల్లితండ్రులు పర్యవేక్షణ ఉంచాలి.

పిల్లల ముందు సంపులను శుభ్రపరిచే పని పెట్టుకోకపోవడం మంచిది. అనుకరించి తర్వాత అందులో పడే ఆస్కారం ఉంటుంది.

సంపులను కడిగే క్రమంలో, నీటి నిల్వలు పరిశీలించిన పిదప తప్పనిసరిగా మూతను పెట్టాలి. ఆ విషయంలో ఏమరపాటు వద్దు. అవసరమైతే సంపులపై ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. పైన ఏర్పాటు చేసిన సిమెంటు పలకలు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలి. భవన నిర్మాణ పనులు చేపట్టే చోట సంపులు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. పనిచేసే వారితోపాటు తోడుగా తెచ్చుకున్న పిల్లలు ఆడుకుంటూ పడిపోయే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న



ప్రమాదాలను పసిగట్టాలి. బయట ఆడుకునేటప్పుడు ఎలాంటి పనులపై నిమగ్నం కాకుండా నిత్యం పర్యవేక్షించాలి.

మచ్చుకుకొన్ని ఘటనలు

వేములవాడ మండలం చింతల్ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు రుషి శనివారం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆడుకునే సమయంలో పొరపాటున నీటి సంపులో పడిపోయాడు. తనతో వచ్చిన పిల్లలు పరిగెత్తి ఇంట్లో వారిని తీసుకొచ్చేలోపే ప్రాణాలు కోల్పోయాడు.గతేడాది డిసెంబరు నెలలో గంభీరావుపేట మండలం నర్మాలలో 18 నెలల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయి మృతి చెందింది. గత సంవత్సరం జులైలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ అనుబంధ గ్రామం గాజులపల్లిలో శ్వేహాన్ (3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. చేతిలో ఉన్న పలక మూత లేని నీటి తొట్టిలో పడింది. అది మృత్యు కుహరం అని తెలియక బాలుడు పలకను తీసే యత్నంలో అందులో పడ్డాడు. బాలుడి కోసం వెతికిన చూసిన తల్లికి సంపులో శవమై కనిపించాడు.



# చెవిరెడ్డి ఇంట్లో సిట్ తనిఖీలు

తిరుపతి: తిరుపతి గ్రామీణం పరిధిలోని తుమ్మలగుంటలో సిట్ అధికారులు సోదాలు చేస్తున్నారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. ఆయన ఇంటికి బుధవారం తాళం వేసి ఉండటంతో అధికారులు వెనదిరిగారు. దీంతో గురువారం సోదాలు చేపట్టారు. మద్యం కేసులో 79 రోజులుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ కుంభకోణంలో భాస్కర్‌రెడ్డి ఏ38గా ఉండగా.. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి ఏ 39గా ఉన్నారు. హైదరాబాద్‌లోని భాస్కర్‌రెడ్డి కంపెనీల్లోనూ బుధవారం సిట్ తనిఖీలు చేసింది. మరోవైపు సీబీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో చిత్తూరులో ఉన్న వైకాపా నేత విజయానందరెడ్డి ఇంట్లో నిన్న సోదాలు చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా చేసిన నారాయణ స్వామి ఇంట్లోనూ కొద్ది రోజుల క్రితం అధికారులు తనిఖీలు చేశారు.

## ఎన్డీయే భాగస్వామ్య పక్షాలపై విమర్శలు వస్తే గట్టిగా తిప్పికొట్టాలి: సీఎం చంద్రబాబు



అమరావతి: ఎన్డీయే భాగస్వామ్య పక్షాలపై ఎలాంటి విమర్శలు వచ్చినా గట్టిగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సహచరులకు సూచించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ప్రధాని మోదీ తల్లిపై రాహుల్ గాంధీ విమర్శలను సకాలంలో తిప్పికొట్టాల్సి ఉందన్నారు. కూటమి పార్టీలుగా పరస్పరం సహకరించుకుంటూ.. ఎవరిపై ఎలాంటి విమర్శ వచ్చినా సమర్థంగా తిప్పికొడదామని తెలిపారు. కిలేడీ అరుణ వ్యవహారంలో అధికారులు సరైన రీతిలో స్పందించకపోవడం వల్లే నేతలు నింద పడాల్సి వస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. అరుణ.. రౌడీషీటర్ శ్రీకాంత్‌కు పెరోల్ ఇప్పించిన ఘటనలో అధికారులు కూడా స్పందించి ఉండాల్సిందన్నారు.

సుగాలి ప్రీతి అంశంలోనూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై అధికారులు మాట్లాడితే బాగుండేదని మనోహర్ అభిప్రాయపడ్డారు.

## జీఎస్టీ సంస్కరణలు.. కోట్ల కుటుంబాల కష్టాలను తొలగిస్తాయి: పవన్‌కల్యాణ్



అమరావతి: జీఎస్టీ శ్లాబుల్లో సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట నుంచి ఇచ్చిన హామీని ప్రధాని మోదీ నెరవేర్చారని కొనియాడారు. ఈ మేరకు 'ఎక్స్'లో పవన్ పోస్ట్ చేశారు. "జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా సంస్కరణలను ముందుకు తీసుకువచ్చారు. దీంతో పేద, మధ్యతరగతి, రైతులకు ఉపశమనం కలుగుతుంది. విద్య, బీమాపై జీఎస్టీని పూర్తిగా తొలగించడంతో ప్రజలపై భారం ఉండదు. పేదల భవిష్యత్తుకు మరింత భరోసా కల్పించడాన్ని స్వాగతిస్తున్నాను. ఈ సంస్కరణలు దేశంలోని కోట్ల కుటుంబాల కష్టాలను తగ్గిస్తాయి. ప్రజల సంక్షేమం కోసం సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు జీఎస్టీ కౌన్సిల్‌కు నా కృతజ్ఞతలు. ఈ ఏడాది ప్రారంభంలో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచారు. ఈ జీఎస్టీ సంస్కరణలు దేశానికి నిజమైన దీపావళి బహుమతిగా నిలుస్తాయి" అని పవన్ పేర్కొన్నారు.

**జీఎస్టీలో సంస్కరణలు శుభపరిణామం: మంత్రి పయ్యావుల...**


జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావడం శుభపరిణామమని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జీఎస్టీలో పలు మార్పులు, చేర్పులు అవసరమని సీఎం చంద్రబాబు మొదటి నుంచి చెబుతున్నారని గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన జీఎస్టీ మార్పులకు ఏపీ పూర్తిగా మద్దతు ఇచ్చిందన్నారు. గురువారం జరిగిన సమావేశంలో కొన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు వ్యతిరేకించినా.. నిర్మలా సీతారామన్ చొరవతో ఏకాభిప్రాయం తీసుకున్నారని చెప్పారు. ఈ మార్పులతో రాష్ట్రాలు ఆదాయం కోల్పోతున్నప్పటికీ పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తెదేపా మొదటి నుంచీ పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందన్నారు.

## నారా లోకేశ్‌ను అభినందించిన ఏపీ కేబినెట్



అమరావతి: డీఎస్సీ సమర్థంగా నిర్వహించారంటూ కేబినెట్ సమావేశంలో మంత్రులు.. నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. డీఎస్సీ అడ్డుకునేందుకు 72 కేసులు వేసినా ప్రతి సవాల్‌ను దీటుగా ఎదుర్కొని మెగా డీఎస్సీ నిర్వహణ విజయవంతం చేశారని ప్రశంసించారు. డీఎస్సీకి ఎంపికైన పోలీసులు.. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుంటే పోలీసుశాఖలో ఏర్పడే ఖాళీలను త్వరగా భర్తీ చేయాలనే అంశంపై చర్చించారు. దాదాపు 400మంది వరకూ పోలీసులు డీఎస్సీకి ఎంపికయ్యారని మంత్రులు అంచనా వేశారు. డీఎస్సీకి వెళ్లిన వారితో ఏర్పడే పోలీసు ఖాళీలు త్వరితగతిన భర్తీకి ఎదురయ్యే లీగల్ సమస్యలను పరిష్కరించుకుందామని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## రైతులంతా జగన్ ఇంటి దగ్గర నిరసన చేపట్టాలి: ఎంపీ అప్పల నాయుడు



విశాఖపట్నం: ఏపీలో రైతాంగానికి అన్యాయం జరుగుతోందని మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ నెల 9న రైతుల కోసం వైకాపా నేతలు నిరసన కార్యక్రమాలు చేస్తామంటున్నారని, వారంతా రైతులను మోసం చేసిన జగన్ ఇంటిదగ్గర నిరసన చేపట్టాలని అన్నారు. "గత ఐదేళ్లలో యూరియా, విత్తనాలను బ్లాక్ చేసిన జగన్..తన మేనమామ ఫ్యాక్టరీలకు తరలించారు. ఫేక్ వార్తలు సృష్టించడంలో జగన్‌మోహన్ రెడ్డి దిట్ట. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇస్తుంది. ప్రజలు ఆనందపడే విధంగా పాలన జరుగుతుంది. వైకాపా ప్రభుత్వం ఉత్తరాంధ్రను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వైకాపా నాయకుల మాటలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయి. యూరియా కొరతపై కూటమి ఎంపీలమంతా కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చాం. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతున్న తరుణంలో డైవర్ట్ చేయాలని వైకాపా నాయకుల ప్రయత్నాలు చేస్తున్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి. సీఎం చంద్రబాబు దూరదృష్టితో పాలన సాగిస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం జగన్ ఏం చేశారో చెప్పాలి. చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చారు. వైకాపా నాయకులు ఆత్మ పరిశీలన చేసుకొని ముందుకెళ్లాలి" అని అప్పలనాయుడు హితవు పలికారు.

## జగన్ హయాంలో ఇళ్ల నిర్మాణంలో భారీ కుంభకోణం: సోమిరెడ్డి



నెల్లూరు: జగన్ హయాంలో ఇళ్ల నిర్మాణంలో భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. అదనపు ధరలతో ఐరన్ కొనుగోలు చేశారని వివరించారు. రూ.3,200 కోట్లు మెటీరియల్ కొనుగోలుకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారన్నారు. లబ్ధిదారుల దొంగ సంతకాలతో మెటీరియల్ మాయం చేశారని ఆరోపించారు. దీనిపై సీఎం చంద్రబాబు విజిలెన్స్ విచారణకు ఆదేశించారన్నారు. "మెటీరియల్ కొనుగోళ్లలో రూ.100 కోట్లు అవినీతి జరిగినట్లు నివేదిక వచ్చింది. కేవలం స్టీల్ కొనుగోలులో రూ.250 కోట్లు కుంభకోణం జరిగింది. ఒక స్టిక్కర్ రూ.630 అయితే రూ.1,300 కొట్టేశారు. 80 శాతం ఇళ్లను పునాది స్థాయిలోనే వదిలేసి పోయారు. ఒక్క ఇంటికి వాడాల్సిన సిమెంట్‌ను 3 ఇళ్లకు వాడారు. భూముల కొనుగోళ్లలోనూ భారీగా అక్రమాలు జరిగాయి" అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు.



# అక్రమంగా చెట్లు నరికివేయడం వల్లే..

## అక్రమంగా చెట్లు నరికివేయడం వల్లే..: వరదలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

భారీ వర్షాలతో ఉత్తరభారతం అతలాకుతలం అవుతోంది. మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలతో ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తున్నాయి. ఈ విపత్తులపై దృష్టిసారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమంగా చెట్లను నరికివేస్తుండటం వల్లే పంజాబ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రకృతి విలయం సృష్టిస్తోందని వ్యాఖ్యానించింది. "ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల్లో సంభవిస్తోన్న ప్రకృతి విపత్తులను మనం చూస్తున్నాం. కొండ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లు నరుకుతున్నట్లు మీడియాలో వస్తోన్న కథనాలతో ప్రాథమికంగా స్పష్టమైన ఆధారాలున్నాయి. వరద నీటిలో భారీ స్థాయిలో దుంగలు తేలియాడుతున్నట్లు ఆ వార్తల్లో గమనించాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. వరుస విపత్తులతో కొండ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిని విచారించిన సుప్రీం ధర్మాసనం.. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంది. దీనిపై కేంద్రం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అలాగే సంబంధిత అధికారులను సంప్రదించి ఆ స్థాయిలో దుంగలు నీటిలో తేలియడానికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. తిరిగి రెండు వారాల తర్వాత ఈ అంశంపై విచారణ జరగనుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో పలుమార్లు క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ఈ విపత్తులో భారీసంఖ్యలో ప్రాణనష్టం చోటుచేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కొండచరియలు విరిగిపడుతుండగా, పంజాబ్‌లోనూ వరదలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

దిల్లీకి వరద ముప్పు క్రమంగా పెరుగుతోంది. నిరాశ్రయుల కోసం ఏర్పాటుచేసిన శిబిరాలే వరద నీటిలో చిక్కుకుపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా యమునా నది ఉప్పొంగుతోంది.



## గణేశుడి లడ్డూ వేలం..
## రూ.6లక్షలకు దక్కించుకున్న తెదేపా ఎంపీ

కర్నూలు: కర్నూలులో గణేశుడి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నేడు నిమజ్జనోత్సవం ఘనంగా జరగనుంది. నగరంలో శోభాయాత్ర ఇప్పటికే ప్రారంభమైంది. మరోవైపు పలుచోట్ల లడ్డూ వేలం కోలాహలంగా సాగింది. ఓల్డ్ సిటీలోని రాంబొట్ల ఆలయం వద్ద వినాయకుడి లడ్డూ వేలం పాటలో తెదేపా ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. రూ.6.01 లక్షలకు లడ్డూను ఆమె కైవసం చేసుకున్నారు.

## డీఎస్సీతో 16 వేల పోస్టులను విజయవంతంగా భర్తీ చేశాం: నారా లోకేశ్



అమరావతి: రాష్ట్రంలో 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను విజయవంతంగా భర్తీ చేశామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. జగన్ ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేదని విమర్శించారు. క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో నారా లోకేశ్ సమావేశమయ్యారు. డీఎస్సీ అభ్యర్థులతో అభినందన సభ పెడితే బాగుంటుందని లోకేశ్‌కు మంత్రులు సూచించారు. గతేడాది ఇదే సమయంలో తలెత్తిన బుడమేరు వరదపై లోకేశ్ చర్చించారు. జగన్ ఐదేళ్ల నిర్వాకంతో బుడమేరు కట్ట తెగి సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. గత అనుభవాలతో ఈసారి అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో సవాళ్లు దీటుగా ఎదుర్కొన్నామని వివరించారు. ఇన్‌ఛార్జి మంత్రులు నియోజకవర్గాల్లో కార్యకర్తల్ని కలవాలని కోరారు. వారి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌లు నిర్వహించాలని సూచించారు. జిల్లాల్లో ఎక్కడైనా యూరియా సమస్య ఉందా అని లోకేశ్ ఆరా తీశారు. అన్ని జిల్లాల్లో తగినంత యూరియా లభ్యత ఉందని మంత్రులు వివరించారు. రైతుల ముసుగులో వైకాపా నేతలు చేస్తున్న కుతంత్రాలను దీటుగా తిప్పికొట్టాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి రోజు తల్లి పట్ల జగన్ వ్యవహరించిన తీరును రాష్ట్రమంతా చూసిందన్నారు. కన్న తల్లినే సరిగా పట్టించుకోని సైకోయిజం జగన్ రూపంలోనే చూశామని పేర్కొన్నారు. జీఎస్టీ శ్లాబ్‌లు కుదించి నిత్యావసరాల ధరలు తగ్గించడం చరిత్రాత్మక సంస్కరణ అని లోకేశ్ తెలిపారు. సంస్కరణలు చేపట్టిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.



## చిన్నప్పటి నుంచి నాకు నాన్నగారే స్ఫూర్తి

దివంగత నేత, తన తండ్రి ఎన్టీఆరే తనకు చిన్నప్పటి నుంచి స్ఫూర్తి అని హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ అన్నారు. ఆయన కృష్ణా జిల్లా నిమ్మకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలుత తన తల్లిదండ్రులు నందమూరి తారక రామారావు, బసవతారకమ్మల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్థులను పలకరిస్తూ యోగక్షేమాలు అడిగిన ఆయన.. మీడియాతో మాట్లాడారు.

## ప్రజలే జగన్‌కు ప్రతిపక్షహోదా ఇవ్వలేదు: ప్రత్తిపాటి



అమరావతి: 'జగన్ ఒంటి నిండా విద్వేషమే.. నరనరాన విషమే.. అణువణువూ అహంకారమే' అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. రైతులకు యూరియా దొరకడం లేదని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆస్తి కోసం సోదరిని దూరం పెట్టిన వ్యక్తి.. ఆడ బిడ్డలకు రక్షణ లేదంటున్నారని ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి మీడియాలో దుష్ప్రచారం చేసి ఆనందించే వ్యక్తిత్వం జగన్‌దని దుయ్యబట్టారు. వైకాపా హయాంలో రైతు ఆత్మహత్యల్లో ఏపీ రెండో స్థానంలో ఎందుకు నిలిచిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలే తనను ప్రతిపక్షనేత చేయలేదన్న నిజం గ్రహించలేని స్థితిలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు.




## గామా అవార్డ్స్ 2025.. చీరకట్టులో కూడా హీట్ పుట్టించిన మీనాక్షి!

దుబాయ్ లో అట్టహాసంగా గామా అవార్డ్స్ వేడుక జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో చాలామంది సినీ సెలబ్రిటీలు తమ సినిమాలతో అవార్డులు సొంతం చేసుకుంటున్నారు. ముఖ్యంగా నార్త్ మాత్రమే కాదు సౌత్ సినీ పరిశ్రమకు చెందిన ఎంతోమంది ప్రముఖులకు ఈ ఈవెంట్ కు రావాలని ఆహ్వానందిన విషయం తెలిసిందే. అందులో అవార్డు అందుకోబోయే వారు మాత్రమే కాకుండా ఇక్కడ సినిమాలతో ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీలు అయిపోయిన వారికి కూడా ఆహ్వానం లభించింది. ఉదాహరణకు కోర్టు సినిమాతో సంచలనం సృష్టించిన కాకినాడ శ్రీదేవికి కూడా ఈవెంట్ కు ఆహ్వానం అందిన విషయం తెలిసిందే.



**గామా అవార్డ్స్ వేడుకల్లో సందడి చేసిన మీనాక్షి..** ఇక ఇప్పుడు ఈ ఈవెంట్లో అవార్డు అందుకోవడానికి వెళ్లిన మీనాక్షి చౌదరి అక్కడ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ఈమె నటించిన లక్కీ భాస్కర్ సినిమాలోని పాత్రకు గానూ ఈమెకు గామా అవార్డు లభించగా.. అవార్డు అందుకోవడానికి వెళ్లిన మీనాక్షి చౌదరి అక్కడ తన లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా క్రీం కలర్ నెట్టెడ్ శారీ ధరించిన ఈమె.. అందాలతో హీట్ పెంచింది అని చెప్పవచ్చు. క్రీం కలర్ నెట్టెడ్ శారీ పై వైట్ కలర్ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఈ శారీ అద్భుతంగా అనిపిస్తోంది. దీనికి కాంబినేషన్ లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. ముఖ్యంగా తన లుక్కును మరింత పెంచుకునేలా సింపుల్ జువెలరీని ధరించింది. ఓవరాల్ గా దుబాయ్ ఈవెంట్లో మీనాక్షి చౌదరి తన అందాలతో అందరిని కట్టిపడేసింది అని చెప్పవచ్చు.

**మీనాక్షి చౌదరి కెరియర్..** ఇక మీనాక్షి చౌదరి కెరియర్ విషయానికి వస్తే.. మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టిన మీనాక్షి చౌదరి.. 2018లో ఫెమినా మిస్ ఇండియాగా, మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ ఫస్ట్ రన్నరప్ గా నిలిచి అందరి దృష్టిని ఆకట్టుకుంది. 2021 లో వచ్చిన 'ఇచ్చట వాహనములు నిలపరాదు' అనే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. ఆ తర్వాత రవితేజ తో ఖిలాడి, అడవి శేషుతో 'హిట్ : ది సెకండ్ కేసు' చిత్రాలలో నటించి మంచి విజయం అందుకుంది. తర్వాత గుంటూరు కారం, లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాఖీ వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి.. ఇప్పుడు చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' సినిమాలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. తెలుగులోనే కాకుండా తమిళ్ చిత్రాలలో కూడా నటించిన ఈమె హిందీ టెలివిజన్ సిరీస్ 'అవుట్ ఆఫ్ లవ్' లో నటించింది అలాగే మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపించింది మీనాక్షి చౌదరి.

## అందాల శ్వేత కవ్వింపులు

'కొత్త బంగారు లోకం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్వేతా బసు ప్రసాద్. మొదటి సినిమాలో క్యూట్‌గా డైలాగ్‌లు చెబుతూ, అందంగా అలరించిన శ్వేతా బసు టాలీవుడ్‌లో మంచి హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. బుల్లి తెర, వెండితెరపైనే కాకుండా ఓటీటీలోనూ శ్వేత బసు కనిపించి కన్నుల విందు చేసింది. కొత్త బంగారు లోకం తర్వాత ఆ స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేక పోయిన శ్వేతా బసు ప్రసాద్ కెరీర్ లో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. తెలుగులో అప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వస్తున్న శ్వేత బసు ఆ మధ్య కొన్ని కారణాల వల్ల వ్యక్తిగతంగా కూడా ఇబ్బందులు పడింది. వాటి నుంచి మెల్లమెల్లగా బయటకు వస్తున్న శ్వేత బసు ప్రసాద్ మళ్లీ ఫామ్‌లోకి రావాలని ప్రయత్నాలు చేస్తోంది.



**శ్వేతా బసు కొత్త లుక్..** ఈ మధ్య కాస్త సన్నగా కనిపించిన శ్వేతా బసు ప్రసాద్ ఇటీవల బరువు పెరిగిందనే వార్తలు వచ్చాయి. ఈ మధ్య కాలంలో శ్వేత బసు ప్రసాద్ హీరోయిన్‌గా సినిమాలు ఏమీ చేయడం లేదు. అయినా కూడా సోషల్ మీడియాలో వరుసగా ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గతంతో పోల్చితే శ్వేతా బసు ప్రసాద్ మరింత అందంగా కనిపిస్తుందని, కొత్త బంగారు లోకం సినిమాలో ఎలా అయితే ఫ్రెష్ గా కనిపించిందో ఇప్పుడు అలాగే కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. శ్వేతా బసు ప్రసాద్ యొక్క అందాల ఆరబోతకు ఈ ఫోటోలు ప్రత్యక్ష సాక్ష్యం అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తూ ఈ ఫోటోలను తెగ షేర్ చేస్తూ లైక్ చేస్తున్నారు. క్లీవేజ్ షో తో కవ్విస్తున్న అందాల శ్వేత ఫోటోలు చూపు తిప్పనివ్వడం లేదు.

## అఖండ 2 రిలీజ్.. మళ్లీ ప్లాన్ మారిందా?



టాలీవుడ్‌లో మాస్ ఆడియన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ అఖండ 2:తాండవం. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. మొదటి భాగం అఖండ సూపర్ సక్సెస్ కావడంతో సీక్వెల్‌పై మాస్ ఆడియన్స్ ఎక్సైట్మెంట్ మరో లెవెల్‌లో ఉంది. సెప్టెంబర్‌లోనే ఈ సినిమా రావాల్సి ఉండగా, పోస్ట్ ప్రొడక్షన్ జాప్యం కారణంగా వాయిదా పడింది.

ఇక ఇప్పుడు రిలీజ్ డేట్‌పై కొత్త బజ్ నడుస్తోంది. డిసెంబర్ 5న రిలీజ్ అవ్వాల్సిన రాజా సాబ్ జనవరికి వెళ్లిపోయింది. దీంతో ఆ డేట్ ఖాళీగా ఉందనే టాక్ మొదలైంది. అదే సమయంలో అఖండ 2 వస్తే బెస్ట్ అని అనుకున్నారు. మేకర్స్ కూడా అదే ఆలోచించారు. కానీ ఇప్పుడు ఏమైందో ఏమో గానీ అఖండ కూడా కూడా జనవరి స్లాట్‌కి షిఫ్ట్ అయ్యే అవకాశముందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ కొత్త రూమర్స్ ఫ్యాన్స్‌లో హైప్ పెంచుతున్నాయి. జనవరిలో సంక్రాంతి సీజన్ ఉంటే, అఖండ 2 లాంటి మాస్ ఎంటర్‌టైనర్ రాక ఆడియన్స్‌కి పండుగ పండగలా మారనుంది. సినిమాకు సంబంధించిన మ్యూజిక్‌ని థమన్ అందిస్తున్నారు. ఈసారి థమన్ మ్యూజిక్ మరింత మాస్ రేంజ్‌లో ఉంటుందని అంచనాలు. అదే సమయంలో యాక్షన్ బ్లాక్స్‌ను హాలీవుడ్ స్టంట్స్ స్థాయిలో డిజైన్ చేస్తున్నారని సమాచారం. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంటలు ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఎలాంటి కాంప్రమైజ్ లేకుండా మేకింగ్ కొనసాగుతోంది. బోయపాటి – బాలయ్య కాంబినేషన్‌లో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ మూడు బ్లాక్‌బస్టర్లు కావడంతో ఈ నాలుగో కాంబోపై నమ్మకం రెట్టింపైంది. అభిమానులు సోషల్ మీడియాలో "జనవరి అంటే నందమూరి బాక్సాఫీస్" అంటూ ఫుల్ హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఒకవైపు రాజా సాబ్ వెనక్కి వెళ్ళడంతో, మరోవైపు అఖండ 2 జనవరి సీజన్‌కి వస్తుందనే బజ్‌తో, ఇప్పుడు ఈ సీజన్ మరింత ఆసక్తికరంగా మారింది.

## కిష్కింధపురి ప్రమోషన్స్‌లో కొత్త ప్రయోగం





టాలీవుడ్‌లో హారర్ సినిమాలు ఎప్పుడూ కూడా ఒక డిఫరెంట్ క్రేజ్ అందుకుంటూ ఉంటాయి. కొత్తదనం, థ్రిల్ కోరుకునే సమయంలో హారర్ జానర్ ప్రేక్షకులు ఎక్కువగా కనెక్ట్ అవుతుంది. ఈ లైన్లోనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్న కిష్కింధపురి భారీ హైప్‌ని సొంతం చేసుకుంది. ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్, టీజర్ ఆకట్టుకోగా, ఇప్పుడు ప్రమోషన్స్‌కి యూనిక్ ట్విస్ట్ ఇచ్చారు మేకర్స్. సెన్సార్ నుంచి A సర్టిఫికెట్ పొందిన ఈ సినిమా ప్యూర్ హారర్ ట్రీట్ ఇవ్వబోతోందని సినిమా యూనిట్ చెబుతోంది. విజువల్‌గా కొత్తదనం, మ్యూజికల్ థ్రిల్లింగ్ సౌండ్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమా ఆడియన్స్‌కి గూస్ బంప్స్ తెచ్చేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్.

ఇదే సమయానికి ప్రమోషన్స్ కోసం వేసిన సెట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రతీ సినిమా ప్రమోషన్స్ కోసం టీమ్స్ ఈవెంట్స్, ప్రెస్ మీట్స్ ప్లాన్ చేస్తాయి. కానీ కిష్కింధపురి మేకర్స్ మాత్రం కొంచెం డిఫరెంట్ రూట్‌లో వెళ్లారు. హారర్ మూవీ కంటెంట్‌కి తగినట్లుగా ఓ స్పెషల్ సెట్ నిర్మించి అందులోనే వెబ్ మీడియా, యూట్యూబ్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఆ సెట్‌లో భయానక వాతావరణం, హారర్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేయడం ద్వారా ఆడియన్స్‌కి డైరెక్ట్‌గా సినిమా వైబ్ ఫీల్ చేయించాలన్నది మేకర్స్ స్ట్రాటజీ. ఇప్పటికే సోషల్ మీడియాలో ఆ సెట్‌కి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. సినిమా రిలీజ్ కాకముందే, ప్రమోషన్స్‌లోనే హారర్ ఫీలింగ్ ఇచ్చేశారు అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. సాధారణంగా మార్కెటింగ్‌లో కొత్త పంథా ఎంచుకున్నప్పుడు ఆ సినిమా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఎక్కువ. అదే రీతిలో కిష్కింధపురి టీమ్ ఈ సెట్‌తో పాజిటివ్ బజ్‌ని పెంచింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ కెమిస్ట్రీ, కౌశిక్ పెగళ్లపాటి డైరెక్షన్, టెక్నికల్ టీమ్ విజువల్స్ కలిపి ఈ సినిమాకు మరో స్థాయి క్రేజ్ తెచ్చాయి. సినిమాలో ఏమి చూపించబోతున్నారు అన్నది ఇప్పుడు హాట్ డిస్కషన్‌గా మారింది. మొత్తం మీద, కిష్కింధపురి ప్రమోషన్లలో తీసుకున్న కొత్త ఎక్స్‌పీరిమెంట్ హిట్ అయ్యింది. ఇక సెప్టెంబర్ 12న థియేటర్లలో అడుగుపెట్టబోతున్న ఈ సినిమా ఎలాంటి కిక్కిస్తుందో చూడాలి.

## గోల్డెన్ కలర్ లెహంగాలో గ్లామర్ తో అలరించిన రుక్మిణి!

రుక్మిణి వసంత్... ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈమె గురించే చర్చ జరుగుతోంది. కారణం వరుసగా పాన్ ఇండియా సినిమాలలో అవకాశం అందుకోవడమే అని చెప్పాలి. ప్రస్తుతం ఈమె.. కోలీవుడ్ లో ఏ.ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'మదరాసి' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహికులు ఘనంగా నిర్వహించారు. ఇందులో గోల్డెన్ కలర్ లెహంగా ధరించి తన గ్లామర్ తోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. అంతేకాదు అందంతో ఈ ఈవెంట్ కి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచింది రుక్మిణి వసంత్. అసలు విషయంలోకి వెళ్తే.. మదరాసి ప్రీ రిలీజ్ ఈవెంట్ లో భాగంగా గోల్డెన్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి పర్ఫెక్ట్ మ్యాచింగ్ లో సాఫ్ట్ దుపట్టా ధరించి.. తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది. అంతేకాదు సింపుల్ జువెలరీతో మరింత ప్రకాశవంతంగా వెలిగిపోయింది. అటు అందంగా కనిపించడమే కాకుండా ఇటు



సాంప్రదాయంగా కూడా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది రుక్మిణి వసంత్.. సింపుల్ లుక్ తో.. మరింత గ్లామర్ వలకబోస్తూ ఎటువంటి హుందాతనం లేకుండా చాలా సైలెంట్ గానే అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం రుక్మిణి వసంత్ ధరించిన ఈ అవుట్ ఫిట్ అభిమానులను కూడా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు. రుక్మిణి వసంత్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం వరుస పెట్టి పాన్ ఇండియా స్టార్ హీరోల చిత్రాలలో అవకాశాలు అందుకుంటుంది. అందులో భాగంగానే ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న 'డ్రాగన్' అనే సినిమాలో ఈమె హీరోయిన్ గా ఎంపికయింది.. అంతేకాదు 'కాంతార' సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న రిషబ్ శెట్టి ప్రస్తుతం 'కాంతార : చాప్టర్ వన్' అంటూ అక్టోబర్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇందులో కూడా హీరోయిన్ గా రుక్మిణి వసంత్ నటిస్తోంది. అలాగే కేజీఎఫ్ చిత్రాలతో సంచలనం సృష్టించిన యష్ తాజాగా నటిస్తున్న చిత్రం టాక్సిక్. ఇందులో కూడా రుక్మిణి హీరోయిన్ గా అవకాశం అందుకుంది.. ఇలా వరుసగా పాన్ ఇండియా చిత్రాలలో.. బడా హీరోలతో అవకాశాలు అందుకోవడంతో సైలెంట్ గానే పెద్ద పెద్ద ప్రాజెక్టులలో అవకాశాలు అందుకుంది అంటూ నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె లైనప్ గురించి మదరాసి ప్రీ రిలీజ్ ఈవెంట్లో నిర్మాత ఎన్.వీ. ప్రసాద్ స్పష్టం చేశారు.

## జాన్వీ పెళ్లి సింపుల్‌గా, హనీమూన్ మాత్రం లాంగ్..!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును దక్కించుకుంది. ఇప్పటికే ఈ అమ్మడు చేసిన సినిమాలు కమర్షియల్ సక్సెస్‌గా నిలువలేక పోయాయి. అయినా తన అందమైన ఫోటోలు, వీడియోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఆకట్టుకుంటూ ఉంది. జాన్వీ కపూర్ అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్‌గా ఇన్‌స్టాగ్రామ్ ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో షేర్ అవుతూ వైరల్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. ఈమె ఏం చేసినా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. జాన్వీ కపూర్ రెగ్యులర్‌గా తిరుపతిలో కనిపిస్తూ ఉంటుంది. తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఇష్టం అని, ప్రత్యేక రోజుల్లో, ఏదైనా ప్రత్యేక సందర్భం ఉంటే తప్పకుండా జాన్వీ కపూర్ స్వామి వారిని దర్శించుకుంటూ ఉంటుంది. సంప్రదాయ దుస్తుల్లో ఆ సమయంలో జాన్వీ కపూర్ చాలా అందంగా కనిపిస్తూ ఉంటుంది.

**పెళ్లిపై జాన్వీ కపూర్ కామెంట్స్...** తాజాగా ఒక ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా తన పెళ్లి, హనీమూన్ గురించి కూడా స్పందించింది. గతంలో చాలా సార్లు జాన్వీ కపూర్ తన పెళ్లి తిరుపతిలో జరుగుతుందని చెప్పింది. ఇప్పుడు కూడా అదే మాట మీద నిలిచింది. తిరుపతిలో తాను పెళ్లి చేసుకుంటాను అంది. అతి కొద్ది మంది బంధు మిత్రుల సమక్షంలో తన పెళ్లి తిరుపతిలో జరగాలని ఎప్పటి నుంచో కోరుకుంటూ ఉన్నాను. అదే



జరుగుతుందని ఖచ్చితంగా చెప్పగలను అంది. తిరుపతిలో వివాహం చేసుకోవడం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పిన జాన్వీ కపూర్ హనీమూన్ విషయంలో మాత్రం చాలా ప్లాన్‌లు చేస్తున్నట్లు పేర్కొంది. హనీమూన్ ను సింపుల్‌గా కాకుండా కాస్త గ్రాండ్‌గానే ఈమె ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. లాంగ్ హనీమూన్ కోసం తాను వెయిట్ చేస్తున్నట్లు ఆమె ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

**లాంగ్ హనీమూన్ కోరుకుంటున్న జాన్వీ కపూర్...** సాధారణంగా పెళ్లి గురించి ఓపెనింగ్ మాట్లాడేందుకే సెలబ్రిటీలు ముఖ్యంగా హీరోయిన్స్ ఆసక్తి చూపించరు. కానీ జాన్వీ కపూర్ ఏకంగా తన హనీమూన్ విషయాన్ని కూడా ఇలా ఓపెన్‌గా లాంగ్ హనీమూన్ కావాలి, ఎక్కువ రోజులు ఎంజాయ్ చేయాలి అనుకుంటున్నట్లు చెప్పడం ద్వారా వార్తల్లో నిలిచింది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ ఒక్క సక్సెస్ అన్నట్లుగా ఎదురు చూస్తోంది. ఇటీవల పరమ్ సుందరి సినిమాతో జాన్వీ కపూర్ వచ్చింది. ఆ సినిమా కచ్చితంగా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. కానీ జాన్వీ కపూర్ కి పరమ్ సుందరి ఆశించిన స్థాయిలో విజయాన్ని కట్టబెట్టలేదు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశను మిగల్చడం తో జాన్వీ కపూర్ హిందీలో మరో సినిమాతో విజయం కోసం ఎదురు చూస్తోంది. ఎన్ని ఫ్లాప్‌లు పడ్డా జాన్వీ క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు.



## కిరాతక తండ్రి..
## ముగ్గురు పిల్లల్ని చంపేసి.. ఆపై ఆత్మహత్య

వెల్దండ గ్రామీణం: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోరం జరిగింది. తన ముగ్గురు పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కిరాతక తండ్రి.. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు, దీపిక దంపతులు. వీరికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), శివధర్మ(4) ఉన్నారు. భార్యతో కలహాల నేపథ్యంలో గత నెల 30న కుమార్తెలు, కుమారుడిని తీసుకుని వెంకటేశ్వర్లు శ్రీశైలం వెళ్లాడు. అక్కడి నుంచి అదేరోజు రాత్రి పిల్లలను తీసుకుని తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్‌కు వెళ్లాడు. 31న ఉప్పునుంతల మండలం సూర్యతండా సమీపంలో చిన్నకుమార్తె వర్షిణి, కుమారుడు శివధర్మపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆ తర్వాత కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో పెద్దకుమార్తె మోక్షితను కూడా అదే తరహాలో చంపేశాడు. అనంతరం కల్వకుర్తి పట్టణానికి వెళ్లి పురుగుల మందు కొనుగోలు చేసి తాగాడు. వెల్దండ మండలం పెద్దాపూర్ శివారు బూరకుంట వద్ద బుధవారం ఉదయం వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యం కావడంతో అతడి సోదరుడు మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దండ ఎస్సై కురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

సీసీ కెమెరాలు పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయరహదారికి ఇరువైపులా ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగించాయి. ఈ క్రమంలో కాలిపోయిన స్థితిలో చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి.



## సింగిల్ స్క్రీన్‌లకు ఊరట

మల్టీప్లెక్స్ రాకతో ఆదరణ కోల్పోయిన సింగిల్ స్క్రీన్ థియేటర్లకు కేంద్రం ఊరట కల్పించే వార్తనిచ్చింది. రూ.100లోపు ఉన్న సినిమా టికెట్లపై జీఎస్టీని కేంద్రం తగ్గించింది. ప్రస్తుతం వీటిపై 12 శాతం జీఎస్టీ ఉండగా.. తాజాగా దాన్ని 5 శాతానికి తగ్గించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లు, చిన్న పట్టణాల్లోని సినిమా హాళ్లకు నేరుగా ప్రయోజనం చేకూర్చే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, రూ.100 కంటే ఎక్కువ ఉంటే మాత్రం అది 18శాతం జీఎస్టీ వసూలు కొనసాగుతుంది.

అంటే, మల్టీప్లెక్స్‌లు, ప్రీమియం థియేటర్లలపై నూతన జీఎస్టీతో ఎలాంటి ప్రభావం లేదు. పాప్‌కార్న్ లేకుండా సినిమా పూర్తి కాదు.. మరి గతంలో వాడివేడి చర్చకు దారి తీసి మీమ్స్‌లో హైలైట్ అయిన పాప్‌కార్న్‌పై నూతన జీఎస్టీ విధానంలో స్పష్టత వచ్చేసింది. సాల్ట్ పాప్‌కార్న్ 5శాతం శ్లాబ్‌లోకి రాగా.. క్యారమిల్ పాప్‌కార్న్ 18 శాతంలోకి వస్తుంది. గతంలో ఒకే పాప్‌కార్న్‌పై ప్యాకేజింగ్‌ను బట్టి వేర్వేరుగా పన్ను విధించే వారు. తాజాగా దీనిని సవరించారు. ఇప్పుడు ప్యాక్ చేసి అమ్ముతారా? విడిగా విక్రయిస్తారా అన్నదానితో ఇక సంబంధం ఉండదు. ప్యాకేజ్డ్, విడిగా అమ్మే సాల్టెడ్ పాప్‌కార్న్‌ను 5శాతం జీఎస్టీ పరిధిలోకి, పంచదార కలిపి చేసిన క్యారమెల్ పాప్‌కార్న్ 18 శాతం పన్ను పరిధిలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్వరూపంలో కీలక మార్పులు చేసిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబులకు బదులు ఇకపై రెండే కొనసాగనున్నాయి. వాటిలో ఒకటి 5% కాగా రెండోది 18%.



## కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

### కామారెడ్డి జిల్లాలో రేవంత్‌రెడ్డి పర్యటన.. దెబ్బతిన్న వంతెనను పరిశీలించిన సీఎం

లింగంపేట: ఇటీవల కురిసి భారీ వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న కామారెడ్డి జిల్లాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. లింగంపేట మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. కుర్దులో వరదలకు దెబ్బతిన్న ఆర్అండ్‌బీ వంతెనను పరిశీలించారు. వరదల సమయంలో వంతెన పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా వంతెన నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ లేదా బ్రిడ్జ్ కమ్ చెక్‌డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. పూర్తిస్థాయి అంచనాలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించారు.



## హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

మెదక్: కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేస్తూ తమ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. శాసనసభలో కాళేశ్వరంపై కాంగ్రెస్ డొల్లతనాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎండగట్టారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లను ఆయన మొక్కారంటూ కవిత ఆరోపించడం బాధ కలిగించిందని తెలిపారు. "హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు. కవిత గతంలో రౌండ్ టేబుల్ సమావేశం పెట్టినా పార్టీ నేతలకు సమాచారం ఇవ్వలేదు.

సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఆమె వెళ్తున్నారు. కేసీఆర్ కుమార్తెగా గౌరవాన్ని నిలుపుకోలేకపోయారు. కవిత తన గొయ్యి తానే తవ్వుకున్నారు" అని పద్మా దేవేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.




## ట్రంప్.. టారిఫ్ వార్ ముగించండి!

ప్రపంచానికి అత్యవసరమైన భారత్-అమెరికా వ్యూహాత్మక బంధాన్ని కాపాడేందుకు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధాన్ని ముగించాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సూచించారు. అమెరికా అధ్యక్షుడు న్యూదిల్లీని దూరం చేసుకొంటే క్వాడ్ కూటమి బలహీనపడి పోతుందని ఆయన హెచ్చరించారు. ఓ ఆంగ్లపత్రికకు రాసిన వ్యాసంలో ఈ అంశాలను ప్రస్తావించారు. ఫలితంగా ప్రాంతీయ భద్రతలో అస్థిరత ఏర్పడటమే కాకుండా.. భారత్ అమెరికా వ్యతిరేక కూటమిలోని రష్యా, చైనాకు దగ్గరవుతుందన్నారు. వ్యూహాత్మక స్వతంత్ర వైఖరి అనేది సార్వభౌమాధికారమని అమెరికా గుర్తించాలన్నారు. "భారత్ కేవలం వాణిజ్య భాగస్వామే కాదు. అది ఇండో-పసిఫిక్‌లో నిర్ణయాత్మక పాత్ర పోషించే దేశం. న్యూదిల్లీని దూరం చేసుకొంటే క్వాడ్ బలహీనపడే ప్రమాదం ఉంది. ఈ కూటమి సదస్సును భారత్ త్వరలో నిర్వహించనుంది. ఏ దేశమైన జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకొంటుంది. తమ ఇంధన సరఫరాదారుల ఎంపిక.. లేదా ఆయుధ కొనుగోళ్లను విషయంలో భారత్‌ను శిక్షించడం సరికాదు. అవి ప్రతికూల ప్రభావం చూపుతాయి" అని థరూర్ పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలు మెరుగుపడటానికి ఆయన కొన్ని ప్రతిపాదనలు చేశారు. భారత్ లేబర్ మార్కెట్‌ను ప్రభావితం చేసే విధించిన టారిఫ్‌లను తొలగించడం, చర్చలను వేగవంతం చేయడం, అత్యున్నత స్థాయిలో దౌత్యాన్ని వేగవంతం చేయడం వంటివి పాటించాలన్నారు. అంతకుముందు థరూర్ అల్ అరేబియా ఇంగ్లిష్‌తో మాట్లాడుతూ భారత్ 200ఏళ్ల పరాయి పాలనను మర్చిపోయి.. విధానాల తయారీలో విదేశీ జోక్యాన్ని అనుమతించే పరిస్థితి లేదన్నారు. ఈ టారిఫ్‌లు పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు.



## స్కూల్ బస్సు కింద పడి విద్యార్థిని మృతి

నల్గొండ: నల్గొండలో విషాదం చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కిందపడి ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి మృతిచెందింది. దేవరకొండ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్ ప్రాంగణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన బాలికను జస్మిత (4)గా గుర్తించారు. బస్సును డ్రైవర్ రివర్స్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలపాలైన చిన్నారిని పాఠశాల సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధరించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



## పామాయిల్‌పై సుంకాల తగ్గింపుతో రైతులకు తీవ్ర నష్టం: భట్టి విక్రమార్క

దిల్లీ: రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులు, రుణాలు తదితర అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు కలిసి వివరించారు. పామాయిల్‌పై తగ్గించిన సుంకాల వల్ల రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించినట్టు మంత్రులు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యాసంస్థలకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు.

## ఉత్తమ అధ్యాపకులకు అవార్డులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విశేష సేవలు అందించిన అధ్యాపకులకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నలుగురు, కాకతీయ యూనివర్సిటీ, శాతవాహన వర్సిటీ, పాలమూరు వర్సిటీ, మహాత్మాగాంధీ వర్సిటీ, వీరనారి చాకలిఐలమ్మ మహిళా వర్సిటీ, డా.బి.ఆర్.అంబేద్కర్ వర్సిటీల నుంచి ఒక్కొక్క అధ్యాపకుడి చొప్పున అవార్డులకు ఎంపికయ్యారు.
వీరితోపాటు రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులు ఉన్నారు. ఈ మేరకు అవార్డులకు ఎంపికైనవారి జాబితాను ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు.






21 రోజులుగా ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని చుట్టుముట్టిన వరద

మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం 21 రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. దీంతో అర్చకులు రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 31 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయడంతో గర్భగుడి ఎదుట ఉన్న మంజీరా నదీపాయ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వరద ప్రవాహం తగ్గగానే అమ్మవారి పునఃదర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. వనదుర్గ ఆనకట్ట, ఆలయం వైపు భక్తులు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com